ప్రజాశక్తి

గురువారం 28 డిసెంబర్ 2023   8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ఇరిగేషన్ నిధులు నీళ్లపాలు

- అంగన్‌వాడీలు వీధిపాలు
- ప్రభుత్వంపై సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ధ్వజం

▶ మెయిన్‌లో

ఒంగోలులో ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

బకాయిలు వెంటనే చెల్లించాలి

కలెక్టరేట్ వద్ద యుటిఎఫ్ ధర్నా

▶ 8లో

ఉద్యమం..ఉద్రిక్తం..

- బాపట్లలో ఎమ్మెల్యే ఇంటిని ముట్టడించిన అంగన్‌వాడీలు
- పోలీసులకు, కార్యకర్తలకు మధ్య తోపులాట..
- జగన్‌పై నమ్మకం లేకపోతే ఇలాగే తిరుగుతా ఉండండి: కోన

ప్రజాశక్తి-బాపట్ల

అంగన్వాడీలతో ప్రభుత్వం జరిపిన చర్చలు విఫలం కావడంతో బాపట్లలో బుధవారం సమ్మె తీవ్ర రూపం దాల్చింది. బాపట్ల శాసనసభ్యులు కోన రఘుపతికి అర్జీ ఇచ్చేందుకు ఆయన ఇంటి సమీపానికి చేరుకున్న అంగన్వాడీలను పోలీసులు అడ్డుకున్నారు. కోన ముందుగా అంగన్‌వాడీలను పట్టించుకోకుండా అక్కడి నుంచి వెళ్లిపోయేందుకు యత్నించారు. కోన ఇంటి ముట్టడికి అంగన్‌వాడీలు యత్నించారు. దీంతో పోలీసులకు, అంగన్‌వాడీలకు మధ్య తోపులాట జరిగింది. బాపట్ల డీఎస్పీ వెంకటేశులు, పట్టణ, గ్రామీణ సిఐలు శ్రీనివాసులు, వేణుగోపాలరెడ్డి ఆధ్వర్యంలో అంగన్‌వాడీలను అడ్డుకొనేందుకు ప్రయత్నించారు. రోప్ టీం తాళ్లతో అంగన్వాడీలను రోడ్డుకు ఒక వైపు నిర్బంధించారు. ఇది జరుగుతున్న సమయంలోనే కోన రఘుపతి కారును వెళ్ళనివ్వకుండా మరోవైపుదారిలో అప్పటికే బైఠాయించిన అంగన్‌వాడీలు అడ్డుకున్నారు. దీంతో ఎమ్మెల్యే కోన అంగన్‌వాడీల వద్దకు వచ్చి.. మాట్లాడారు. అంగన్‌వాడీల న్యాయమైన కోర్కెలు తీర్చడం సబబే అని, అయితే జీతాలు ఏ మేరకు పెంచాలనే నిర్ణయం జగనన్నదే అన్నారు. సిఎం జగన్మోహన్‌రెడ్డిపై నమ్మకం ఉంచాలని, జగ నన్నపై ఎంతమందికి నమ్మకం ఉందో చేతులెత్తాలని అడిగారు. ఒక్కరూ చెయ్యెత్తకపోయేసరికి 'జగన్మోహన్‌రెడ్డిపై నమ్మకం లేనప్పుడు ఎవరేం చేస్తారు. ఇట్లాగే తిరుగుతూ ఉండండి' అన్నారు. ఈ సందర్భంగా అంగన్వాడీల యూనియన్ జిల్లా కార్యదర్శి ▶ 2లో

బాపట్లలో అంగన్‌వాడీలకు, పోలీసులకు మధ్య తోపులాట జరుగుతున్న దృశ్యం

మంత్రి ఇంటి గేటుకు అర్జీ

మంత్రి సురేష్ ఇంటి గేటుకు అర్జీ తగిలిస్తున్న అంగన్‌వాడీలు

ఒంగోలు కలెక్టరేట్: అంగన్‌వాడీలు మార్కాపురంలోని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖమంత్రి ఆదిమూలపు సురేష్ ఇంటి గేటుకు అర్జీ ఇచ్చారు. ఆ సమయంలో మంత్రి సురేష్ ఇంటిలో లేరు. యర్రగొండపాలెంలో అంగన్‌వాడీలు మంత్రి సురేస్ క్యాంప్ కార్యాలయాన్ని కూడా ముట్టడించారు. ఒంగోలులో శాసనసభ్యులు బాలినేని శ్రీనివాసరెడ్డి ఇంటి వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం బాలినేని శ్రీనివాసరెడ్డి పిఏ కస్తూరెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. తమ డిమాండ్లు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డిని ఫోన్‌లో యూనియన్ నాయకులు కోరారు. టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెంలోని కొండపి శాసనసభ్యులు డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి ఇంటిని అంగన్‌వాడీలు ముట్టడించారు. కనిగిరిలో ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్‌కి వినతిపత్రం అందజేశారు.

వైసిపిలో ముదురుతున్న సంక్షోభం

- పోటీ నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించిన గిద్దలూరు ఎమ్మెల్యే
- విజయసాయిరెడ్డితో మంత్రులు, మాగుంట, బాలినేని, బూచేపల్లి భేటీ

వైసిపి జిల్లా నేతలతో మాట్లాడుతున్న విజయసాయిరెడ్డి

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

జిల్లాలో వైసిపి అధిష్టానం చేపట్టిన మార్పులు కొన్ని చోట్ల సర్దుబాటు దిశగా అడుగులు పడుతుంటే కొన్ని చోట్ల వికటిస్తున్నాయి. మార్పుల వల్ల రోజురోజుకూ రాజకీయ సంక్షోభం ముదురుతోంది. విజయవాడలో బుధవారం నాడు రీజినల్ కోఆర్డినేటర్ విజయసాయిరెడ్డితో మంత్రులు, జిల్లా నేతలు భేటీ అయ్యారు. కొండపి, సంతనూతలపాడు నియోజకవర్గాలపై చర్చ సాగింది. అక్కడ మార్పుల వల్ల చోటుచేసుకున్న పరిణామాలను సర్దుబాటు చేసేందుకు ఈ భేటీ నడిచింది. మంత్రులు ఆదిమూలపు సురేష్, మేరుగ నాగార్జున, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి, సీనియర్ నేత, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, సంతనూతలపాడు ఎమ్మెల్యే సుధాకర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, వరికూటి అశోక్‌బాబు, పార్టీ అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి తదితరులు భేటీలో పాల్గొన్నారు. అక్కడ చర్చల సారాంశం ఒక్కటే. ఇద్దరు మంత్రులు ఈ రెండు నియోజకవర్గాల్లో కొత్తగా పోటీ చేస్తున్నందున అందరూ కలిసి గెలుపు కోసం సహకరించాలని విజయసాయిరెడ్డి సూచించారు. ఇప్పటివరకూ బాలినేని చెప్పకుండా తాము ఎవరికీ సహ కరించబోమంటూ సంతనూతలపాడు నియో జకవర్గ నేతలు ప్రకటించిన సంగతి తెలిసిందే. నాలుగు రోజులు గడిచాక ఈ భేటీ పెట్టారు. పార్టీ ఆదేశానుసారం అందరూ కలిసి పని చేయాల్సిందేనని విజయసాయిరెడ్డి ఈ భేటీలో నేతలకు స్పష్టం చేశారు. మంత్రుల గెలుపునకు సహకరించాలని బాలినేనిని కోరారు. ఇదే సమయంలో జిల్లా నేతలు పలు విషయాలు విజయసాయిరెడ్డి దృష్టికి తీసుకుపోయినట్లు సమాచారం. బాలినేని కొన్ని అంశాలపై చర్చించేందుకు సిఎంతో భేటీ కోసం కొద్ది రోజులుగా ఎదురుచూస్తున్నారు. ఆయన గురువారం సిఎంను కలిసే అవకాశం ఉందని నేతలు చెబుతున్నారు. ప్రధానంగా ఇళ్ల స్థలాల కోసం సేకరించిన భూములకు రూ.160 కోట్లు నిధులు విడుదల చేయాల్సి ఉంది. నిధులు ఇస్తేనే ఒంగోలులో పోటీ చేస్తానని బాలినేని ప్రకటించడం గమ నార్హం. ఇప్పుడు ఈ అంశం అటోఇటో తేలాల్సి ఉంది. టిక్కెట్ల వ్యవహారంతో కొన్ని నియోజక వర్గాలకు ఆయన కొన్ని పేర్లు సూచించారు. వాటిపైనా ఏ నిర్ణయం తీసుకోలేదు. ఇవన్నీ పలు రకాల చర్చలకు ▶ 2లో

మాట్లాడుతున్న అన్నా రాంబాబు

వచ్చే ఎన్నికల్లో..

పోటీ నుంచి తప్పుకుంటున్నా..!

- 'మాగుంట'ను ఓడించేందుకు పని చేస్తా..
- గిద్దలూరు ఎమ్మెల్యే 'అన్నా' వ్యాఖ్యలు

▶ 8లో

అక్రమంగా ఫారం-7 దరఖాస్తు చేసిన

46 మందిపై క్రిమినల్ కేసు

కలెక్టర్ రంజిత్‌బాషా

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

నిబంధనలు ఉల్లంఘించి ఫారం-7 దరఖాస్తులు చేసిన 46 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేశామని, వారందరినీ అరెస్టు చేసి చార్జిషీట్ ఫైల్ చేశామని కలెక్టర్ రంజిత్‌బాషా చెప్పారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో బుధవారం ఆయన సమావేశమయ్యారు. ప్రత్యేక సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితా షెడ్యూల్ పొడిగిస్తూ ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు జారీ చేసిందని కలెక్టర్ తెలిపారు. ఓటర్ల నుంచి వచ్చిన అభ్యంతరాలను ఎన్నికల కమిషన్ పరిగణనలోకి తీసుకుని జనవరి 12 వరకు దరఖాస్తుల విచారణ గడువు పొడిగించిందన్నారు. ఓటర్ల జాబితా ప్రచురణకు తుది విచారణ గడువు జనవరి 17 తేదీతో ముగుస్తుందన్నారు. కొన్ని జిల్లాల్లో అధికంగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నందున జనవరి 5వ తేదీన ముద్రించాల్సిన ఓటర్ల తుది జాబితా గడువును ఎన్నికల కమిషన్ పొడిగించినట్లు తెలిపారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జనవరి 22న ప్రత్యేక సంక్షిప్త సవరణ ఓటర్ల తుది జాబితాను ముద్రించనున్నట్లు తెలిపారు. డిసెంబర్ 9వ తేదీ నాటికి బాపట్ల జిల్లాలో 1,82,707 దరఖాస్తులు వచ్చాయన్నారు. ఇప్పటివరకు 1,53,968 దరఖాస్తులు పరిష్కరించగా, 457 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, 28,282 దరఖాస్తులు తిరస్కరించినట్లు వివరించారు. కేవలం 0.25 శాతమే మన జిల్లాలో పెండింగ్ దరఖాస్తులు ఉన్నాయన్నారు. పొరపాట్లు, తప్పులు లేకుండా పారదర్శకంగా ఓటర్ల విచారణ కొనసాగుతుందన్నారు. పర్చూరు నియోజకవర్గంలో మృతులైన వారిని ఓటర్ల జాబితాలో ▶ 2లో

ఉద్యమం..ఉద్రిక్తం..

(మొదటిపేజీ తరువాయి)

రేఖ ఎలిజిబెత్, బాపట్ల ప్రాజెక్ట్ యూనియన్ అధ్యక్షురాలు శైలశ్రీ ఎమ్మెల్యే కోనకు వినతిపత్రం అందజేశారు.

ప్రజాశక్తి ప్రత్యేక సంచికలోని అంశాల ప్రస్తావన

'చర్చలు విఫలం..ఉద్యమం ఉధృతం' అనే ప్రధాన శీర్షికన 'ప్రజాశక్తి' ప్రచురించిన ప్రత్యేక సంచికలో అంగన్‌వాడీలకు సంబంధించిన పలు అంశాలను ఈ సందర్భంగా కోన రఘుపతి ప్రస్తావించారు. ప్రధానంగా హర్యానాలో వేతనాల పెంపు, అంగన్వాడీల సీనియార్టీని పరిగణలోకి తీసుకున్న అంశాల గురించి మాట్లాడారు. అంగన్‌వాడీల సమ్మెకు సిఐటియు నాయకులు శరత్, బి. తిరుమలరెడ్డి, మైనారిటీ ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎండి చిస్తి, సిపిఎం సీనియర్ నాయకులు నూతన పాటి కోటేశ్వరరావు, జనవిజ్ఞానవేదిక రాష్ట్ర జిల్లా అధ్యక్షులు వై. భాస్కరరావు అంగన్వాడీల సమ్మెకు సంఘీభావం తెలిపారు.

వైసిపిలో ముదురుతున్న సంక్షోభం

(మొదటిపేజీ తరువాయి)

తావిస్తున్నాయి. పార్టీలో అయోమయ పరిస్థితికి దారితీస్తున్నాయి. బాలినేని హైదరాబాద్‌లోనే ఉండటం కూడా పార్టీ నేతల్లో కొంత గందరగోళానికి దారితీసింది. కీలకమైన నేతగా ఉన్న ఆయన పరిస్థితే అయోమయంగా మారింది. ఇక ఎంపీ మాగుంట వ్యవహారంపైనా చర్చ సాగుతోంది. ఆయనకు కొన్ని షరతులు పెట్టారనే చర్చ సాగుతోంది. పార్లమెంటు స్థానంపైనా పలు రకాలుగా చర్చ నడుస్తోంది. ఇవన్నీ అస్పష్టత చర్చకు తావిస్తున్నాయి. పార్టీలో సమన్వయం కొరవడేలా చేశాయి. జిల్లా నేతల అయోమయ పరిస్థితికి అద్దం పట్టాయి. ఇక తాజాగా గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు వ్యవహారం పార్టీలో కలకలం రేపింది. గిద్దలూరులో పోటీ నుంచి తప్పుకుంటున్నట్లు ఆయన ప్రకటించారు. జిల్లా నేతలపై ఆయన చేసిన ఆరోపణలు పార్టీలో తీవ్ర చర్చకు దారితీశాయి. ఎంపీ మాగుంటకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేయడం చర్చగా మారింది. ఆయన ఎందుకు అలా ఆరోపణలు చేశారనే దానిపై నేతలు ఆరా తీస్తున్నారు. తనపై వ్యతిరేకంగా ప్రచారాలు సాగిస్తుంటే జిల్లా నేతలు ఎవరూ పట్టించుకోలేదని ఆరోపించారు. వైసిపిలో బలమైన సామాజికవర్గంపై ఆయన గుర్రుగా ఉన్నారని తెలుస్తోంది. ఇక పోటీ నుంచి తప్పుకున్నట్లు ప్రకటించడానికి కారణంపైనా చర్చ సాగుతోంది. అధిష్టానం టిక్కెట్టు లేదని స్పష్టత ఇచ్చాకే ఈ నిర్ణయం తీసుకున్నారా? లేక పార్టీలో ముఖ్యనేతల సహకారం లేదని భావించి తప్పుకున్నట్లు ప్రకటించారా? అనే దానిపై మిశ్రమంగా చర్చ సాగుతోంది. ఏదేమైనా రాంబాబు హఠాత్తుగా తీసుకున్న ఈ నిర్ణయం పార్టీలో చర్చకు దారితీసింది. పార్టీలో ఎలాంటి పరిస్థితులున్నాయనే దానికి ఆయన నిర్ణయం ఒక ఉదాహరణగా కనిపిస్తోంది. ఇక దర్శిపై ఇప్పటికే క్లారిటీ వచ్చింది. కనిగిరి, గిద్దలూరు, వైపాలెం నియోజకవర్గాలలో అభ్యర్థుల ప్రకటనపై ఉత్కంఠ నెలకొంది. గిద్దలూరులో కొత్త అభ్యర్థి ఎవరనే దానిపై చర్చ మొదలైంది. ఆశావహులు పెరుగుతున్నారు. వైపాలెంలోనూ కొత్త అభ్యర్థిని ఎంపిక చేయాల్సి ఉంది. మార్కాపురంలో సిట్టింగ్‌ను కొనసాగిస్తారా? మార్పు చేస్తారా? అనేదీ చూడాలి. మార్పులు చేసిన చోట తలెత్తుతున్న సంక్షోభాలు పార్టీ అధిష్టానానికి సవాలుగా మారుతున్నాయి. దీంతో ఆచీతూచీ అడుగులు వేయాల్సి వస్తోంది. దీంతో మిగతా అభ్యర్థుల ప్రకటనపై జాప్యం జరుగుతోంది.

46 మందిపై క్రిమినల్ కేసు

(మొదటిపేజీ తరువాయి)

నుంచి తొలగించాలంటూ 22,870 దరఖాస్తులు నమోదయ్యాయన్నారు. అందులో 10,468 దరఖాస్తులు పరిష్కరించామని, 12,384 తిరస్కరించామని, 18 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. పోలీసులు, అధికారుల సమక్షంలో విచారణ జరుగుతోందన్నారు. ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు రాత్రి, పగలు పనిచేస్తున్నారని తెలిపారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు, మార్గదర్శకాలను అనుసరించి అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకటరమణరావు ఎన్నికల విభాగం పర్యవేక్షకులు కృష్ణకాంత్, కాంగ్రెస్ పార్టీ నాయకులు డి రవి, బిజెపి నాయకులు రామకృష్ణ, బిఎస్‌పి నాయకులు కె కోటేశ్వరరావు, వైసిపి నాయకులు ఐ మాల్యాద్రి, టిడిపి నాయకులు షేక్ మహమ్మద్ గౌస్‌బాషా పాల్గొన్నారు.

రహదారికి మరమ్మతులు చేపట్టాలి

ప్రజాశక్తి-వెలిగండ్ల

చీర్లదిన్నె-మొగులూరు తారు రోడ్డు నిర్మాణం గత కాంగ్రెస్ ప్రభుత్వంలో 2012-2013వ సంవత్సరంలో పూర్తయింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు అనగా గత పది సంవత్సరాలుగా రోడ్డు మరమ్మతులు చేపట్టకపోవడంతో ఈ లింకు రోడ్డులో పెద్దపెద్ద గుంతలు ఏర్పడి అధ్వాన స్థితికి చేరుకుంది. వాహనదారులు ఈ రోడ్డులో ప్రయాణించాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించడానికి బెంబేలెత్తుతున్నారు. కనుక తక్షణం ప్రభుత్వం స్పందించి చీరలదిన్నె మొగులూరు రహదారి మరమ్మతులు చేపట్టి త్వరగా పూర్తిచేసి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా ప్రజ అవసరాలను గమనించి ప్రభుత్వం పని చేయాలని పత్రికా ప్రకటనలో పీసీసీ సభ్యులు పిల్లి వెంకటేశ్వర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సమన్వయ కమిటీ సభ్యులు షేక్ మహమ్మద్‌బాషా, మల్లికార్జునరెడ్డి, హనుమంతునిపాడు మండల అధ్యక్షులు బలసాని కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డును పరిశీలిస్తున్న పీసీసీ సభ్యుడు పిల్లి వెంకటేశ్వరరెడ్డి

తెలుగుదేశం పాలనతోనే గ్రామాల అభివృద్ధి

టీడీపీ ఇన్‌ఛార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి

ప్రజాశక్తి-గిద్దలూరు

గ్రామాల అభివృద్ధి నారా చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని గిద్దలూరు టీడీపీ ఇన్‌ఛార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాల యంలో టీడీపీ సర్పంచులు, మాజీ సర్పంచులు ముఖ్య నాయకులతో సమావేశమైన అశోక్‌రెడ్డి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గ్రామాల్లో ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా జరగలేదని, పంచాయతీ నిధులను దోచుకున్న ఘనుడు జగన్మోహన్‌రెడ్డి అని అన్నారు. నాడు తెలుగుదేశం హయాంలో గ్రామాలలో అభివృద్ధి చేస్తే నేడు దోచుకోవ టమే పనిగా పెట్టుకున్నారని, మళ్లీ గ్రామాల్లో అభివృద్ధి జరగాలంటే తెలుగుదేశంతోనే సాధ్యమని అన్నారు. కావున గ్రామాల్లోని సమస్యలను గ్రామ వికాసం ద్వారా టీడీపీ అధినేత దృష్టికి తీసుకెళ్లి తెలుగుదేశం అధికారంలోకి రాగానే గ్రామాలను అభివృద్ధి చేసుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు, జడ్పీటీసీ సభ్యులు, తెలుగుదేశం సర్పంచులు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీ, మాజీ ఎంపీటీసీలు, మండల ప్రధాన కార్యదర్శులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని నిరసన

ప్రజాశక్తి-దర్శి

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించే వరకు పోరాటం చేస్తామని జిల్లా కార్యదర్శులు ధనిరెడ్డి వెంకటరెడ్డి, జి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీఆర్సీని, అరియర్స్‌ను ఇవ్వాలని, డీఏలు, పీఎఫ్, క్లోజర్స్ అమలు చేయాలని, లోన్స్ ఏపీజీఎల్ లోన్స్ మొదలగునవి సమస్యలను పరిష్కరించాలని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా యూటీఎఫ్ చేసే పోరుబాటలో భాగంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ జి కోటేశ్వరరావు, దర్శి అధ్యక్షులు మీనిగ శ్రీను, ట్రెజరర్ కొండవీటి రామారావు, దొనకొండ ప్రధాన కార్యదర్శి రోశయ్య, ముండ్లమూరు మాజీ అధ్యక్షులు తిరుపతిరెడ్డి, ఎం యలమందారెడ్డి, మండల కార్యదర్శులు మణికుమార్, కోటిరెడ్డి, నాగేశ్వరరావు, భాస్కర్‌రెడ్డి, విజయభాస్కర్ పాల్గొన్నారు.

నేడు రైతు సంఘం జిల్లా మహాసభ

ప్రజాశక్తి-త్రిపురాంతకం

త్రిపురాంతకంలోని ఆర్యవైశ్య అన్నదాన సత్రంలో ఈ నెల 28, 29 తేదీలలో రైతు సంఘం జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కెవివి ప్రసాద్, రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు పి రామ చంద్రరావు, జిల్లా రైతు సంఘం అధ్యక్షులు హనుమారెడ్డి పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ మహాసభలకు రైతులు, రైతు సానుభూతిపరులు, కమ్యూనిస్టు నాయకులు పాల్గొనాలని కోరారు.

12 లోపు ఓటర్ల జాబితా సవరణ

ప్రజాశక్తి-దర్శి

జనవరి 12వ తేదీ వరకు ఓటర్ల జాబితాలో చేర్పులు, తొలగింపులు చేసుకోవచ్చని ఎలక్ట్రికల్ రిజిస్ట్రేషన్ అధికారి ఎంవీఎస్ లోకేశ్వరరావు అన్నారు. తహశీల్దారు కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీలతో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా 17వ తేదీన ఓటర్ల జాబితా ప్రచురిస్తారని, 22వ తేదీన తుది జాబితా ప్రకటిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా ఈవీఎంలను పరిశీలించారు. అభ్యంతరాలు ఉంటే తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ దేవదానం, టీడీపీ సీహెచ్ వెంకటేశ్వర్లు, జనసేన పాపారావు, బీజేపీ నారాయణరెడ్డి, తహశీల్దారు వెంకటేశ్వర్లు, డీటీ రవిశంకర్ పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్ర' ప్రారంభం

ప్రజాశక్తి-కొత్తపట్నం

కొత్తపట్నం మండలం కే పల్లిపాలెం గ్రామ పంచాయతీలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని ఎంపిపి లక్ష్మిపోతు అంజిరెడ్డి ఘనంగా ప్రారంభించారు. కే పల్లెపాలెం, కొత్తపట్నం1,2, రంగాయపాలెం గ్రామ క్రికెట్ టీమ్‌లను లంకపోతు అంజిరెడ్డి పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా అనేక రకాల పోటీలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోందని అన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ విశ్వనాథపల్లి ఆనందరావు, సదరు కార్యక్రమానికి నోడల్ ఆఫీసర్ బాల చెన్నయ్య పాల్గొన్నారు.

పుస్తక పఠనాన్ని అలవరచుకోవాలి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

విద్యార్థులందరూ పుస్తక పఠనాన్ని అలవరచుకోవాలని యర్రగొండపాలెం మండల విద్యాశాఖాధికారి పి ఆంజనేయులు అన్నారు. యర్రగొండపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బుధవారం ప్రకాశం గ్లోబల్ ఎన్నారై ఫోరం, ప్రవాస భారతీయ వాసవి సంఘం, సేవింగ్ స్మైల్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో గ్రంథాలయ పుస్తకాలను బహూకరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి పిచ్చారావు అధ్యక్షత వహించారు. ఎంఈఓ ఆంజనేయులు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి గ్రంథాలయ పుస్తకాలను శ్రద్ధతో చదవాలని తెలిపారు. ఉత్తమ పౌరులుగా ఎదగాలని కోరారు. పుస్తకాలను బహూకరించిన కొలుకుల ఎన్నారై హరినాథ్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్నారై వై హరినాథ్ బాబు, ఎంఈఓ 2 మల్లునాయక్, కార్యక్రమ కో-ఆర్డినేటర్ శాఖమూరి శ్రీనివాసరావు, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు డి బాదరయ్య, వై సుబ్రమణ్యం, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

వై పాలెంలో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పట్టణంలోని 23వ బూత్ ఇన్‌ఛార్జి మేడబలిమి చిన్నా పరిధిలో బుధవారం బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ భవిష్యత్తు గ్యారెంటీ బాండ్లను నమోదు చేశారు. రాబోయే ఎన్నికలలో టిడిపిని గెలిపించి చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేయాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి కంచర్ల సత్యనారాయణ గౌడ్, పట్టణ టిడిపి అధ్యక్షులు షేక్ మస్తాన్‌వలి (మ్యాక్స్), 23వ బూత్ ఇన్‌ఛార్జి మేడబలిమి చిన్నా, తుమాటి చిన్న సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష ఫీజు చెల్లింపునకు మరో అవకాశం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు తాత్కాలికంగా పరీక్ష ఫీజు చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరో అవకాశం కల్పించినట్లు ఎంఈఓ పి ఆంజనేయులు బుధవారం తెలిపారు. రూ.500 ఆలస్య రుసుముతో ఈ నెల 28 నుంచి జనవరి 2వ తేదీ వరకు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు. ఫెయిల్ అయిన విద్యార్థులు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

జడ్‌పి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభను కనబరిచారు. జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో వ్యాస రచన, క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. వ్యాస రచన పోటీల్లో మార్కాపురం జడ్‌పి బాలు ఉన్నత పాఠశాల విద్యార్థులు జివి శివనాయుడు ప్రథమ స్థానం, క్విజ్ పోటీల్లో షేక్ అమ్మార్, శివ నాయుడులకు ద్వితీయ స్థానం, వక్తృత్వ పోటీల్లో పి అజీర్‌ఖాన్‌కు తృతీయ స్థానం లభించింది. ఈ మేరకు జిల్లా జాయింట్ కలెక్టర్ కె శ్రీనివాసులు చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు. స్థానిక ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మునగాల చంద్రశేఖరరెడ్డి విజేతలను అభినందించారు.

ఉపాధ్యాయులకు వీడ్కోలు

ప్రజాశక్తి-హనుమంతునిపాడు

హనుమంతనిపాడు మండలం మహమ్మదాపురం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. గతంలో పనిచేసి 2023 జూన్ నెలలో ఇతర పాఠశాలలకు బదిలీపై వెళ్లిన కొణిజేటి నారాయణ, మణిరాజ్ ఉమామహేశ్వరని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు గతంలోని అనుభవాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు ఉపాధ్యాయులు నాగమణి, భాస్కర్‌రెడ్డి, వై శ్రీనివాసరావు, బాలయ్య, నారాయణ రెడ్డి, శశిభూషణ్, దద్దాల శ్రీనివాసులు, శ్రీనివాసులు, శ్రీదేవి, సుజాత, హిమబిందు, సంధాని పాల్గొన్నారు.

మిరపలో తెగుళ్లపై అవగాహన

ప్రజాశక్తి-పుల్లలచెరువు

ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో యర్రగొండపాలెం ఉద్యాన శాఖ అధికారి పి ఆదిరెడ్డి పుల్లలచెరువు మండలంలోని యండ్రపల్లి గ్రామంలోని మిరప తోటలను సందర్శించి బుధవారం రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఉద్యాన శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సేవలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

వికలాంగులు ఐకమత్యంతో కలిసి కట్టుగా ఉండి తమ సమస్యలను పరిష్కరించుకోవాలని వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు గుమ్మా రాజయ్య తెలిపారు. బుధవారం ఆయన సమావేశంలో మాట్లాడారు. ట్రై సైకిళ్ళు, కృత్రిమ అవయవాలు, చంక కర్రలు, వినికిడి యంత్రాలు, వీల్ చైర్లు కోసం ఆర్డీటి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

రెండో రోజూ మున్సిపల్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి-మార్కాపురం

తమను రెగ్యులర్ చేయాలని ఎపి మున్సిపల్ కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కార్మికుల సమ్మె మార్కాపురం మున్సిపాలిటీలో బుధవారం నాటికి రెండో రోజుకు చేరుకుంది. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట సమ్మె శిబిరం కొనసాగుతోంది. మద్దతుగా ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు గుమ్మా బాలనాగయ్య నిలిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. రెగ్యులర్ చేస్తామని ఆ నాడు చెప్పడం జరిగిందన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత సమస్య పరిష్కరించాలని కోరగా సాకులు చెబుతున్నారని ఎద్దేవ చేశారు. ఇచ్చిన హామీ నెరవేర్చేంత వరకు ఉద్యమం ఆగదన్నారు. రెండో రోజు సమ్మెలో భాగంగా కార్మికులంతా మోకాళ్లపై ప్రభుత్వానికి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కాంట్రాక్ట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కె సుబ్బరాయుడు, నాయకులు హరికృష్ణ, జిపి తిరుమలయ్య, షేక్ సలాంఖాన్, షేక్ ఇమాంసా, సింగ్, జి అల్లూరయ్య, తప్పెట్ల శ్రీనివాసులు, పలువురు కార్మికుల పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: గిద్దలూరు మున్సిపల్ కార్మికులు చేపట్టిన సమ్మె రెండో రోజుకు చేరింది. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు ఆవులయ్య మాట్లాడుతూ ఇంజనీ రింగ్ కార్మికులకు హెల్త్ అలవెన్స్ జీవో నెంబర్ 30 ప్రకారం కార్మిక శాఖ ప్రాతిపదికన వేతనాలు ఇవ్వాలని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి 2019 ఎన్నికల ముందు అసెంబ్లీలోనూ, బయట పాదయాత్రలోనూ మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులందరికీ వైసిపి ప్రభుత్వం అధికారం రాగానే ఆరు నెలలో పర్మినెంట్ చేస్తానని, సమాన పనికి సమాన వేతనం చెల్లిస్తానని పర్మినెంట్ సిబ్బందికి సిపిఎస్‌ను వారం రోజుల్లోనే రద్దు చేస్తామని హామీలు ఇచ్చార న్నారు. ఆయన అధికారంలోకి వచ్చి ఐదు సంవత్సరాలు పూర్తి కావస్తున్నా ఇంతవరకు ఆ హామీలు అమలు కాలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు జి నాగయ్య, డి వెంకటయ్య, డి సుందర్‌రావు, వెంకట్రావు, మౌలాలి, సిఐటియు మండల కార్యదర్శి బి నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

చీమకుర్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులు

చీమకుర్తి: చీమకుర్తిలో రెండోరోజూ కూడా మున్సిపల్ కార్మికులు సమ్మె కొనసాగించారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. స్థానిక బస్టాండ్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ ఇచ్చిన హామీలు మాత్రమే అడుగుతున్నామని, ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు పూసపాటి వెంకటరావు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) జిల్లా ఉపాధ్యక్షులు ఇట్టా నాగయ్య, నాయకులు పాలేటి ఏడుకొండలు, పి పద్మ, అల్లడి కోటేశ్వరరావు, ఆర్ కోటేశ్వరరావు, గోవిందు, ఆంద్రీ, ఏలేషు, సుబ్బరత్తమ్మ పాల్గొన్నారు.

కనిగిరి: రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం నుంచి జరుగుతున్న మున్సిపల్ కార్మికుల సమ్మె బుధవారం రెండో రోజుకు చేరుకుంది. ఈ సమ్మెకు పిసిసి సభ్యులు పిల్లి వెంకటేశ్వర్ రెడ్డి మద్దతును తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ 2019 ఎన్నికల్లో జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా గత ఐదు సంవత్సరాలుగా కాలయాపన చేశారని విమర్శించారు. జగన్మోహన్ రెడ్డి హామీలు నోటి మాటలకే పరిమితమయ్యాయని అన్నారు. కార్మికుల డిమాండ్లను సత్వరం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. శానిటరీ సిబ్బంది, సచివాలయ సిబ్బందికి మధ్య నలిగిపోతున్నామని, పనిముట్లను సకాలంలో ఇవ్వకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని కార్మికులు తెలపగా అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సమన్వయ కమిటీ సభ్యులు ఎస్ మల్లికార్జున రెడ్డి, హనుమంతునిపాడు మండల పార్టీ అధ్యక్షులు కోటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఆయేషా

భార్యపై కత్తితో దాడి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

భార్యపై భర్త కత్తితో దాడి చేసి గాయపరిచిన సంఘటన బుధవారం రాత్రి యర్రగొండపాలెంలో జరిగింది. అయేషా, మస్తాన్ భార్యాభర్తలు. వారి మధ్య మనస్పర్ధలు రావడంతో సంవత్సరం క్రితం విడిపోయి విడివిడిగా ఉంటున్నారు. పెద్దలు పంచాయితీ చేసినా భార్య అయేషా మాత్రం భర్తతో ఉండడానికి ఒప్పుకోలేదు. భర్త ఆస్తి మొత్తం తన పేరు మీద రాసి విడాకులు ఇవ్వాలని పట్టుపట్టింది. ఆమె ఇటీవలే భర్త, అత్తమామలపై గృహ హింస కేసు పెట్టింది. కోర్టులో కేసు నడుస్తోంది. ఈ నేపథ్యంలో బుధవారం భార్య ఆయేషాపై భర్త మస్తాన్ కత్తితో దాడి చేశాడు. ఆమె తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమెను హుటాహుటిన ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్సలు చేస్తున్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో ఈ దాడి చోటు చేసుకుంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మస్తాన్ పరారీలో ఉన్నాడు.

సముద్రంలో గల్లంతైన యువకుడు మృతి

ప్రజాశక్తి-కొత్తపట్నం

కొత్తపట్నం బీచ్ వద్ద గల్లంతయిన యువకుడి మృతదేహం గమండ్లపాలెం బీచ్ ఒడ్డుకు కొట్టుకు వచ్చినట్లు ఎస్ఐ మీ సాంబశివరావు తెలియజేశారు. సోమవారం నాడు బీచ్‌కు ముగ్గురు యువకులు వచ్చారు. అయితే వారు సముద్రంలో అలల తాకిడికి మునిగిపోతుండడంతో ఇద్దరిని స్థానిక మెరైన్ పోలీసులు కాపాడారు. కేసనపల్లి ప్రవీణ్ అనే యువకుడు సముద్రంలో కొట్టుకు వెళ్ల గా బుధవారం సాయంత్రం గమండ్లపాలెం వద్ద కు కొట్టుకువచ్చినట్లు తెలియజేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు ఆయన తెలియజేశారు. ఈ కేసును దర్యాప్తు చేయనున్నట్లు ఎస్ఐ సాంబశివరావు తెలియజేశారు.

ఆటోలో నుంచి పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

ఆటోలో నుంచి పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన పెద్ద దోర్నాల మండలంలోని హసనాబాద్ హరివిల్లు గ్రామాల మధ్య మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. చిన్నగుడిపాడు గ్రామానికి చెందిన కాకర్ల భాస్కర్(40) అనే వ్యక్తి అటోలో ప్రయాణిస్తూ ఆటోలో నుంచి కొంద పడి తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని 108 సహాయంతో పెద్దదోర్నాలలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్సలు అందజేసి మెరుగైన చికిత్సల కోసం ఒంగోలుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు బంధువులు తెలిపారు.

పోగొట్టుకున్న పాసుబుక్కులు రైతుకు అందజేత

ప్రజాశక్తి-కనిగిరి

ఈ నెల 26న సాయంత్రం కాకర్లకు చెందిన రైతు బీ లక్ష్మయ్య కనిగిరి ఖమ్మం బస్సులో ప్రయాణిస్తున్న సమయంలో రెండు పాస్ పుస్తకాలు, స్థలాలకు చెందిన పత్రాలను మరిచి వెళ్లిపోయాడు. కనిగిరి బస్సును డిపోలో మెయిన్ గేటు వద్ద డ్యూటీలో ఉన్న ఆర్టీసీ హెడ్ కానిస్టేబుల్ ఎస్ కొండయ్య చూసి వెంటనే ఖమ్మం బస్టాండ్‌లో ఉన్న కంట్రోలర్‌కు వివరాలు తెలియజేశారు. మంగళవారం రైతు కనిగిరి డిపోకు రాగా పాస్ పుస్తకాలు స్థలం పత్రాలను హెడ్ కానిస్టేబుల్ ఎస్ కొండయ్య అప్పగిం చారు. హెడ్ కానిస్టేబుల్ ఎస్ కొండయ్యకు రైతు లక్ష్మయ్య కృతజ్ఞతలు తెలిపారు.

యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన

ప్రజాశక్తి-మార్కాపురం

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని యుటిఎఫ్ డిమాండ్ చేసింది. ఈ మేరకు స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట బుధవారం ధర్నా జరిగింది. ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ఈ ఆందోళన కొనసాగింది. ఉద్యోగ, ఉపాధ్యాయు లకు రావలసిన పిఆర్‌సి బకాయిలు, ఎపిజిఎల్ఐ క్లోజర్ల బకాయిలు, సరెండర్ లీవ్ బకాయిలతో పాటు మెడికల్ బిల్లులు, సిపిఎస్ ఇన్‌స్టాల్మెంట్లు సుమారు రూ.11,462 కోట్లు తక్షణమే చెల్లించాలనే డిమాండ్‌తో ధర్నా కొనసాగింది. దశలవారీ ఆందోళన మొదలైందని, ఉద్యమం ఉధృతం కాకముందే సమస్య పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల నేతలు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు వీరారెడ్డి, యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ బి శ్రీరాములు, ప్రాంతీయ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి వెంకటేశ్వర్లు, పి అల్లూరిరెడ్డి, నాసరయ్య, చంద్రశేఖరయ్య, శ్రీనివాస నాయక్, వివిధ మండలాల నుంచి ఉద్యోగ, ఉపాధ్యాయులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

కంభంలో ఉపాధ్యాయుల నిరసన

వెంటనే పరిష్కరించాలి

కనిగిరి: ఉపాధ్యాయుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు మీగడ వెంకటేశ్వరరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం సాయంత్రం కనిగిరి పట్టణంలోని పులి వెంకటరెడ్డి పార్క్ వద్ద ఉపాధ్యాయులు నిరసన దీక్ష చేపట్టారు. దీక్షను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల డిఎ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. పిఆర్‌సి బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు ఎస్కే కాజా రహంతుల్లా, టి రమణారెడ్డి, ఏ పోతులూరయ్య, రాము, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

యుటిఎఫ్ పోరుబాట

కంభం : ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని, పిఆర్సి, డిఏ అరియర్స్ చెల్లించాలని, ఏపీజీఎల్, పిఎఫ్ లోన్లు క్లోజర్లు, సరెండర్ లీవ్ బకాయిలు వెంటనే చెల్లించాలని కోరుతూ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర సంఘం పోరుబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ మహాధర్నాలో కంభం ప్రాంతీయ మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, సీనియర్ కార్యకర్తలు, ఉపాధ్యాయులు పెద్దఎత్తున పాల్గొని కంభం తహసీల్దారుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ మూడు మండలాల ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర సంఘ జిల్లా కార్యదర్శి ఐవి రామిరెడ్డి, కంభం మండల ప్రధాన కార్యదర్శి కె సునీల్, వి వెంకటేశ్వర్లు, ఐ, తిరుపతయ్య, లక్ష్మి రెడ్డి, డి, ఖాసీంవలి, మూడు మండలాల ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి హాకీ పోటీలకు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండలంలోని మైనంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్లు పీఈటి టి రవికుమార్ (హాకీ రవి) తెలిపారు. ఎంపికైన క్రీడాకారులకు స్కూల్ స్టాఫ్ హాకీ స్టిక్ బ్యాగ్స్ అందజేశారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 28వ తేదీ నుంచి జనవరి 1వ తేదీ వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని గ్వాలియర్‌లో జరిగే జాతీయ స్థాయి హాకీ పోటీల్లో పాల్గొంటారని బుధవారం హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు డివిఎల్ నరసింహారావు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ నాయకులు గొడుగు మస్తాన్, స్కూల్ స్టాఫ్, ప్రకాశం జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ కే వనజ పాల్గొన్నారు.

ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

సిమెంట్ రోడ్డు నిర్మాణం ప్రారంభం

ప్రజాశక్తి-కొత్తపట్నం: కొత్తపట్నం మండలం కే పల్లెపాలెంలో సిమెంటు రోడ్డు నిర్మాణాన్ని ఎంపీపీ లంకపోతు అంజిరెడ్డి ప్రారంభించారు. ఈ సిమెంట్ రోడ్డు కొత్తపట్నం నుంచి బీచ్ వరకు నిర్మాణం జరుగుతుందని ఆయన తెలియజేశారు. కొత్తపట్నం బస్టాండ్ సెంటర్లో ఆర్అండ్‌బి స్థలంలో ఉన్న బంకులకు వెంటనే నోటీసులు ఇవ్వాలని అధికారులకు సూచించారు. ఈ రోడ్డు నిర్మాణం వెంటనే పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ విశ్వనాథపల్లి ఆనంద్, బాల చెన్నయ్య, మత్స్యకార యూనియన్ అధ్యక్షులు గొల్లపోతు నాగార్జున, పంచాయతీ కార్యదర్శి మణిదీప్, గ్రామ నాయకులు, కాంట్రాక్టర్లు, కరెంటు ఏఈ తదితరులు పాల్గొన్నారు.

పదవులన్నీ ఒక సామాజిక వర్గానికేనా?

ఎమ్మెల్యే బుర్ర తీరుపై 'ముత్యాల' అభ్యంతరం

ప్రజాశక్తి-సిఎస్ పురం

పదవులన్నీ యాదవులకేనా? మిగిలిన సామాజిక వర్గాల వారు వైసీపీకి అవసరం లేదా అంటూ వైసీపీ మండల నాయకుడు ముత్యాల నారాయణరెడ్డి ప్రశ్నించారు. వైసీపీ నాయకుడు ముత్యాల నారాయణరెడ్డి, అయ్యలూరివారిపల్లి సర్పంచ్ భారతి నారాయణరెడ్డి బుధవారం ఓ పత్రికా ప్రకటన విడుదల చేశారు. జనరల్ కేటగిరిలో ఉన్న ఎంపీపీ పదవిని యాదవులకు కేటాయించి, టిడిపి నుంచి వైసీపీలో చేరిన మూడమంచు వెంకటేశ్వర్లు(యాదవ్)కు ఇచ్చారని పేర్కొన్నారు. జడ్పిటిసి మేకల శ్రీనివాసులు (యాదవ్), వైసిపి మండల అధ్యక్షుడు భువనగిరి వెంకటయ్య(యాదవ్), మండల యూత్ అధ్యక్షుడు బోర్రాజు రమణయ్య(యాదవ్), మండల మహిళా అధ్యక్షురాలు కుర్రా జయమ్మ(యాదవ్), సింగిల్ విండో అధ్యక్షుడు పెరుగు సుబ్బరామయ్య (యాదవ్), వైఎస్ఆర్ టియుసి జిల్లా అధ్యక్షుడు మేకల బాలు(యాదవ్) ఇలా మండలంలోని పదవులన్నీ యాదవులకే కేటాయించారు. బీసీలలో అనేక కులాల వారు ఉండగా వారికి ఎవరికీ పదవులు ఇవ్వకుండా ఒకే కులానికి చెందిన వారికే పదవులన్నీ ఇవ్వడం ఎంతవరకు కరెక్ట్ అని ప్రశ్నించారు. మొదటి నుంచి పార్టీ కోసం కష్టపడి పని చేసిన మిగిలిన సామాజిక వర్గాల వారికి ఎమ్మెల్యే తీరని అన్యాయం చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే బుర్ర మధుసూదన్‌యాదవ్ వ్యవహారం వల్ల పార్టీకి తీవ్ర నష్టం చేకూరుతుందని అన్నారు. పార్టీ కోసం పని చేస్తున్న వారికి తగిన గుర్తింపు ఇవ్వకపోతే రాబోయే ఎన్నికల్లో పార్టీకి తీవ్ర నష్టం జరుగుతుందని వారు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఢిల్లీలో మందకృష్ణను కలిసిన డాక్టర్ ఉగ్ర

ప్రజాశక్తి-కనిగిరి

ఢిల్లీలో ఎమ్మార్పీఎస్ వ్యవ స్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగను కనిగిరి మాజీ ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌ఛార్జి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. రాబోయే ఎన్నికల్లో సహకరించాలని డాక్టర్ ఉగ్ర కోరారు. ఎన్నికల సమయంలో కనిగిరి ప్రాంతానికి వచ్చి తన సామాజికవర్గ ఓటర్లను కలసి ప్రచారం నిర్వహించి గెలుపునకు కృషి చేస్తానని మందకృష్ణ మాదిగ డాక్టర్ ఉగ్రకు హామీ ఇచ్చారు. కనిగిరి నియోజకవర్గంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులపై వారు చర్చించారు.


మంద కృష్ణతో డాక్టర్ ఉగ్ర

యుటిఎఫ్ క్యాలండర్ ఆవిష్కరిస్తున్న ఎంఇఒ హరిబాబు

యుటిఎఫ్ డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి - నిజాంపట్నం

అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహ అనే నినాదాలతో ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో యుటిఎఫ్ కృషి చేస్తుందని ఎంఇఒ కె హరిబాబు అన్నారు. స్థానిక ఎంఆర్‌సి భవనంలో యుటిఎఫ్ నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్, అధ్యాపక దర్శినిలను బుధవారం ఆవిష్కరించారు. ఉపాధ్యాయ పక్షపాతిగా మాత్రమే కాకుండా విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని యుటిఎఫ్ 10వ తరగతి విద్యార్థుల కోసం ప్రతి సంవత్సరం అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో రూపొందించిన మాదిరి ప్రశ్నాపత్రాల ద్వారా విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ సిహెచ్ బాపయ్య, మండల అధ్యక్షులు కె రాజేష్, ప్రధాన కార్యదర్శి సిహెచ్ గణేష్ రావు, జిల్లా కౌన్సిలర్ నరేష్, ఉపాధ్యాయులు ఉమా, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించండి

ప్రజాశక్తి - పర్చూరు

సిహెచ్ హనుమంతరావు

సమగ్ర శిక్ష విభాగంలో పని చేస్తున్న ఉద్యోగులు పని వేళలతో సంబంధం లేకుండా 24గంటలూ పనిచేస్తున్నారని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, జిపిఫ్, ఇఎస్ఐ వంటి పథకాలు వర్తింపాచే యాలని హిందీ ఉపాధ్యాయ సంఘం డిమాండ్ చేస్తూ సంపూర్ణ మద్దతు తెలిపిందని జిల్లా అధ్యక్షులు సిహెచ్ హనుమంతరావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ సమగ్రశిక్షా ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. వారిని క్రమంబద్ధికరించాలని, ప్రభుత్వం స్పందించి చర్చలకు పిలిచి న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరారు. హిందీ టీచర్స్ యూనియన్ జిల్లా, మండల యూనిట్ సభ్యులు శిబిరాన్ని సందర్శించి వారికి సంఘీభావం తెలిపారు.

బూచేపల్లి ట్రస్ట్ ఆధ్వర్యంలో మెటీరియల్ పంపిణీ

విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి - అద్దంకి

మండలంలోని బొమ్మనంపాడు జెడ్‌పి ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు బూచేపల్లి వెంకాయమ్మ, సుబ్బారెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో పరిమళ ఫౌండేషన్ చైర్మన్ బివి కృష్ణారెడ్డి, ఎజిపి యర్రమోతు రమేష్ బాబు సహకారంతో స్టడీ మెటీరియల్ ఉచితంగా అందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ మెటీరియల్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఇంచార్జి హెచ్ఎం ఎస్ నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు కోవి శ్రీనివాసరావు, ఎం శ్రీనివాసరావు, దామా నాగేశ్వరరావు, పి శంకరరావు, జ్యోతి శ్రీమన్నారాయణ మూర్తి పాల్గొన్నారు.

విఆర్ఎ బ్రహ్మయ్యకు నివాళి

ప్రజాశక్తి - అద్దంకి

గొట్టిపాటి రవి పరామర్శ

మండలం కొత్తరెడ్డిపాలెం విఆర్ఎగా విధులు నిర్వహిస్తున్న బొమ్మనంపాడు గ్రామానికి చెందిన అద్దంకి బ్రహ్మయ్య రోడ్డు ప్రమాదంలో మరణించాడు. విషయం తెలుసుకున్న ఎంఎల్ఎ గొట్టిపాటి రవికుమార్ అతని మృత దేశానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ప్రభుత్వ బెదిరింపులకు భయపడం

ఎంపి మోపిదేవి వెంకటరమణకు అర్జీ ఇస్తున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి - రేపల్లె

అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావుకు వినతి పత్రం అందజేశారు. సీఐటీయు నాయకులు ఎంపితో మట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వంతో తమ సమస్యలు ప్రభుత్వంతో మాట్లాడాలని, తమకు న్యాయబద్ధన వేతనాలు అమలు చేయాలని కోరారు. సమ్మెశిబిరం నుండి ఎంపి ఇంటిదాకా ప్రదర్శన నిర్వహించారు. మోపిదేవి వెంకటరమణరావు మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం సమస్యల పరిష్కారం కోసం అనేక మార్గాలు ఆలోచిస్తుందని అన్నారు. తాను ప్రభుత్వంలో ఉన్న పెద్దలతో మాట్లాడతానని అన్నారు. అంగన్‌వాడి సమస్యల పరిష్కారం కోసం ప్రయత్నిస్తానని అన్నారు. ఎంఎల్ఎ అనగాని సత్యప్రసాద్ కార్యాలయం వద్దకు చేరుకుని ప్రభుత్వంతో మాట్లాడాలని వినతిపత్రం అందజేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ మణిలాల్ మాట్లాడుతూ ప్రభుత్వం చర్చలు పేరుతో పిలవటం, సమయం కావాలని కాలయాపన చేస్తూ అంగన్‌వాడీలను రెచ్చగొట్టడం, సమ్మె విరమించకపోతే గైహాజరు పేరుతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని, జీతాలు కట్ చేస్తామంటూ బెదిరిస్తున్నారని అనినారు. కార్యక్రమంలో ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె ఝాన్సి, ప్రాజెక్ట్ కార్యదర్శి కె వాణి, వై మేరీమణి, నిర్మలజ్యోతి, జ్యోతి, శివలక్ష్మి, మల్లేశ్వరి, సంతోషా కుమారి, చైతన్య, ఉష, కెవి లక్ష్మణరావు, కె రమేష్, కె ఆశీర్వాదం పాల్గొన్నారు.

మంత్రి నాగార్జున ఇంటి గేటుకు అర్జీ అంటించిన అంగన్వాడీ

కొల్లూరు : అంగన్‌వాడీ నిరసన సమ్మె 16వ రోజు చుండూరు, వేమూరు, భట్టిప్రోలు మండలాల అంగన్‌వాడీలు కొల్లూరులో నిరసన చేపట్టారు. ధర్నా

ఎంఎల్ఎల ఇళ్లు ముట్టడించిన అంగన్వాడీలు

శిభిరం నుండి మంత్రి మేరుగ నాగార్జున ఆఫీస్ ముట్టడికి బయలుదేరి వెళ్లారు. ప్రభుత్వం మొండి వైఖరి వదిలి అంగన్‌వాడిల డిమాండ్లు పరిష్కరించాలని నినాదాలు చేశారు. మంత్రి నాగార్జున అందుబాటులో లేకపోవడంతో ఆఫీస్ గేటుకు వినతి పత్రం అంటించారు. అంగన్‌వాడిల సమ్మెకు యుటీఎఫ్ నాయకులు మద్దతు పలికారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు టి కృష్ణమోహన్, సిఐటియు నాయకులు బి అగస్టీన్, బి సుబ్బారావు, అమృతలూరు ప్రాజెక్ట్ కార్యదర్శి కామేశ్వరి, సెక్టర్ లీడర్స్ భాగ్యమ్మ, వనజ, పద్మ, నాగరాజుకుమారి, పద్మావతి, సావిత్రి, నాగేంద్రమ్మ, ప్రజా సంఘనాయకులు ఎం సత్యనారాయణ, నాగరాజు, యుటిఎఫ్ నాయకులు వినోద్ కుమార్, పరిశుద్ధరావు, రాజేష్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలతో మాట్లాతున్న హనిమిరెడ్డి

అద్దంకి : అంగనవాడి కార్యకర్తల సమస్యలు పరిష్కరించేందుకు సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని వైసిపి ఇన్చార్జి హనిమిరెడ్డి అన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు 16వ రోజు సమ్మెలో భాగంగా స్థానిక ఆర్ అండ్ బి బంగాళాను ముట్టడించారు. హనిమిరెడ్డి బంగ్లా నుండి బయటకు వచ్చి అంగన్‌వాడి కార్యకర్తల సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని స్వీకరించారు. తాను మధ్యతరగతి కుటుంబం నుండే వచ్చానని బాధలు తనకు తెలుసని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు తంగిరాల వెంకటేశ్వర్లు, ఏటి యు అధ్యక్షులు జి శారద, ధనలక్ష్మి, అనంతలక్ష్మి, అనిత, కల్పన పాల్గొన్నారు.

వైసిపి కార్యాలయం వద్ద అంగన్‌వాడీల ధర్నా

పర్చూరు : అంగన్‌వాడీ కార్యకర్తలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక వైసిపి కార్యాలయంలో

బలరాం క్యాంపు కార్యాలయం వద్ద అడ్డుకున్న పోలీసులు

బుధవారం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి జి ప్రతాప్ కుమార్, ప్రాజెక్టు నాయకురాలు వెంకటలక్ష్మి, కె శ్రీనివాసరావు, బి చినదాసు, ఎం డేవిడ్, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

చీరాల : అంగన్‌వాడీ కార్యకర్తల న్యాయమైన డిమాండ్స్ పరిష్కరించకుంటే ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని సిఐటియు పట్టణ కార్యదర్శి ఎం వసంతరావు అన్నారు. మండలంలోని రామకృష్ణాపురంలో ఉన్న ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి క్యాంపు కార్యాలయం వద్దకు అంగన్వాడీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో చేరుకుని బుధవారం ముట్టడించారు. పోలీసులు అంగన్‌వాడీ కార్యకర్తలను అడ్డుకున్నారు. దీంతో కొద్దిసేపు వారి మధ్య తోపులాట జరిగింది. బారికెట్లు నెట్టుకుంటూ అంగన్‌వాడీ కార్యకర్తలు ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ప్రభుత్వం నియంతృత్వ వైఖరి అవలంబిస్తుందని, ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్ దగ్గరికి రాకుండా ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. సమస్యలు పరిష్కారం అయ్యేవరకు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో జి సుజీవన, సులోచన, ఎ బ్యూలా, శిరీష, భూలక్ష్మి, అనిత, దుర్గ పాల్గొన్నారు.

పుట్టావారిపాలెం అడ్డరోడ్డు జంక్షన్లో అంగన్‌వాడీల ధర్నా

సంతమాగులూరు : అంగన్‌వాడీల పట్ల ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా బుధవారం ఐసిడిఎస్ కార్యాలయం నుండి 3కిలోమీటర్ల దూరంలో ఉన్న పుట్టావారిపాలెం అడ్డరోడ్డు జంక్షన్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. జంక్షన్‌లో ఉన్న వైసిపి ఫ్లెక్సీ ముందు బైఠాయించి తమ సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు మస్తాన్ బి నాయకులు శ్రీదేవి, ఎస్తేరురాణి, నిర్మల, ఆదెమ్మ, రమణ, మల్లేశ్వరి పాల్గొన్నారు.

సిఎం చిత్తశుద్ధి నిరూపించుకోవాలి

- మోకాళ్ళ పై కూర్చొని కార్మికుల నిరసన
- 2వ రోజు మున్సిపల్ కార్మికుల సమ్మె
- మద్దతు తెలిపిన ప్రజా సంఘాలు

మోకాళ్లపై కూర్చుని మున్సిపల్ కార్మికుల నిరసన ధర్నానే నాయకులు

ప్రజాశక్తి - చీరాల

మున్సిపల్ కార్మికులకు ఎన్నికలకు ముందు సిఎం వైఎస్ జగన్ ప్రతిపక్ష నేతగా ఇచ్చిన హామీలు నెరవేర్చి తన చిత్తశుద్ధి నిరూపించుకోవాలని సిఐటియు పట్టణ అధ్యక్షులు ఎన్ బాబురావు అన్నారు. మున్సిపల్ కార్మికుల సమ్మె 2వ రోజు చేరుకుంది. రాష్ట్రవ్యాప్త సమ్మెలో భాగంగా స్థానిక మునిసిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. మున్సిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్ల కోసం రాష్ట్ర ప్రభుత్వంతో అనేక దఫాలు చర్చలు జరిపినప్పటికీ సమస్యలు పరిష్కారం కాని కారణంగా అనివార్యమైన పరిస్థితిలో సమ్మెలోకి నెట్టబడ్డారని అన్నారు. కార్మికుల సమ్మెకు ప్రజావేదిక అధ్యక్షులు గుమ్మడి ఏసురత్నం, 93బీసీ కులాల ఐక్యవేదిక నాయకులు తాడిపోయిన లక్ష్మీ ప్రసాద్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు బుడంకుంట్ల లక్ష్మీ నరసయ్య, చేతివృత్తుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ పి కొండయ్య, కెవిపిఎస్ నాయకులు జయరాజు, కాంగ్రెస్ నాయకులు అంబటి పుష్పరాజు మద్దతు తెలిపారు. మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్ పట్టిణ కమిటీ అధ్యక్షుడు నూతలపాటి రాజు, కార్యదర్శి ఎండ్లూరి సింగయ్య, కమిటీ సభ్యులు మానికల శంకర్, దుడ్డు సామెల్, మెతీష, బడుగు కుమారి, మరియమ్మ, శిరీష, తిరుపతమ్మ, తమ్మిశెట్టి యశోద, గూడూరు మేరిబాబు పాల్గొన్నారు.

పొదిలి : కాంటాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను అధికారంలోకి వచ్చిన నెల రోజులలోపు రెగ్యులర్ చేస్తామన్న సిఎం హామీని నెరవేర్చాలని నగర పంచాయతీ కార్మికులు డిమాండ్ చేశారు. 2వ రోజు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలనే డిమాండ్ చేశారు. నగర పంచాయతీగా మారినప్పటి నుండి కార్మికులకు ఇవ్వాల్సిన హెల్త్ అలవెన్స్ 32నెలలుగా ఇవ్వకపోవడంతో ఒక్కోక్కరు రూ.లక్షా92 వేలు నష్టపోతున్నారన్నారు. కార్యక్రకమంలో మున్సిపల్ వర్కర్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు నాయకులు డి సుబ్బయ్య, కెవి నరసింహాం, బి కోటేశశ్వరరావు, పి నాగేంద్రమ్మ, బి హజరత్తమ్మ, ఎ రాజయ్యలు పాల్గొన్నారు.

డాక్టర్ ఐ బాబురావు దంపతులకు ఘన సన్మానం

బాబురావు దంపతులకు సన్మానం

ప్రజాశక్తి - చీరాల

పేరాల సెయింట్ మార్క్స్ చర్చ్ సండే స్కూల్ సుపర్నిడెంట్ బ్యులా లారెన్స్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకల్లో భాగంగా డాక్టర్ ఐ బాబురావు, సుభాషిణి దంపతులను బుధవారం ఘనంగా సత్కరించారు. చిన్ననాటి నుండే పిల్లలకు సండే స్కూల్ ద్వారా దేవుని మాటలను తెలియజేస్తూ ఆయన మార్గంలో నడవడానికి కృషి చేస్తున్న సండే స్కూల్ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. వేడుకలకు తహాశీల్దారు జె ప్రభాకరరావు, డాక్టర్ ఐ బాబురావు, యడం రవిశంకర్, సెయింట్ మార్క్స్ లూథరన్ చర్చ్ పాస్టర్ రెవరెండ్ కె జోసఫ్ కెరీ, పిసిసి చైర్మన్ డి అశోక్ కుమార్, ట్రెజరర్ పి ఆనంద్ బాబు, కో ఆప్షన్ సభ్యులు డి అజయ్ కుమార్ హాజరయ్యారు. బాలుడు నడవ వలసిన త్రోవను వానికి నేర్పుము. వాడు పెద్దవాడైన దాని నుండి తొలగిపోడు అన్న బైబిల్ మాటలు నేడు చిన్నారులకు ఎంతో అవసరం అన్నారు. అతిధులకు బ్యూలా లారెన్స్ ఆధ్వర్యంలో శాలువా కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు.

చులకనగా మాట్లాడటం సరికాదు..

'అంగన్‌వాడీల' యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె సుబ్బరావమ్మ ● 16వ రోజు కొనసాగిన సమ్మె

ఒంగోలు కలెక్టరేట్ ఎదుట ఆందోళనలో మాట్లాడుతున్న సుబ్బరావమ్మ, యర్రగొండపాలెంలో మంత్రి క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించిన అంగన్‌వాడీలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

అంగన్‌వాడీల సమస్యను పరిష్కరించకుండా.. మహిళలను చులకనగా మాట్లాడటం సరైంది కాదని ఎపి అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె సుబ్బరావమ్మ పేర్కొన్నారు. బుధవారం ఒంగోలు కలెక్టరేట్ వద్ద సమ్మె శిబిరంలో సుబ్బరావమ్మ మాట్లాడారు. గత 16 రోజుల నుంచి అంగన్‌వాడీ వర్కర్స్, మహిళలు రోడ్లపై వచ్చి ఆకలి మంటలతో వేతనాలు పెంచాలని నిరవధిక సమ్మె చేస్తున్నా.. ప్రభుత్వానికి పట్టడం లేదన్నారు. కాకమ్మ కథలు చెబుతూ అంగన్‌వాడీలను మోసం చేసే పద్ధతిలో మంత్రివర్గం చర్చలు జరుపుతోందన్నారు. సమస్యలను పరిష్కరించకపోతే రానున్న రోజుల్లో ప్రభుత్వ కార్యాలయాలను దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టరేట్, అంబేద్కర్ విగ్రహం, చర్చి సెంటర్, మున్సిపల్ కార్యాలయం, శివాలయం, గ్రంథాలయం, కోర్టు సెంటర్ మీదుగా అంగన్‌వాడీల ర్యాలీగా ఒంగోలు శాసనసభ్యులు బాలినేని శ్రీనివాసరెడ్డి నివాసానికి వెళ్లారు. అక్కడ ధర్నా కార్యక్రమం చేపట్టారు. అనంతరం బాలినేని శ్రీనివాసరెడ్డి పిఎ కృష్ణారెడ్డికి వినతిపత్రం ఇచ్చి, తమ డిమాండ్లు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డిని ఫోన్‌లో యూనియన్ నాయకులు కోరారు. కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి తంగిరాల మహేష్, నగర ఉపాధ్యక్షులు దామా శ్రీనివాసులు, జి.రమేష్, యూనియన్ జిల్లా కార్యదర్శి ఈదర అన్నపూర్ణ, యూనియన్ నాయకులు కెవి సుబ్బమ్మ, పి ప్రశాంతి, సిహెచ్ జ్యోతి, కె శ్రీదేవి, సంధ్యారాణి, నిర్మల, పద్మ, కె జయశ్రీ, నాగేంద్రం, కష్ణవేణి, మౌలాలి పాల్గొన్నారు.

యర్రగొండపాలెం: అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ 16 రోజులు నుంచి నిరవధిక సమ్మె చేస్తున్నా ప్రభుత్వానికి చీమ కుట్టినట్లుగా కూడా లేదని సిఐటియూ జిల్లా ఉపాధ్యక్షుడు డికెఎం రఫీ అన్నారు. ఈ క్రమంలో బుధవారం అంగన్‌వాడీలంతా యర్రగొండ పాలెంలోని మంత్రి సురేష్ క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించారు. గేటుకే అర్జీ అంటించారు. డిమాండ్లు పరిష్కరించాలని మండుటెండలో సుమారు నాలుగు గంటలు పాటు అక్కడే కూర్చున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ వెంకట రాజేష్ పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియూ ఏరియా కో ఆర్డినేటర్ షేక్ అమీర్‌బాషా, అంగన్‌వాడీ నాయకురాళ్లు మల్లేశ్వరి, పి సుభాషిణి, ఎ నాగమల్లేశ్వరి, అరుణ కుమారి, సుజాత, రోజా, సుబ్బులు, సిహెచ్ సునీత, అరుణ, కే జయమ్మ, ఏ నాగరాజుకుమారి, సుబ్బులు తదితరులు పాల్గొన్నారు.

సిఎస్ పురం రూరల్: అంగన్వాడీల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని యుటిఎఫ్ నాయకుడు ఇర్ల కొండయ్య డిమాండ్ చేశారు. అంగన్వాడీలు తమ డిమాండ్ల సాధన కోసం నిర్వహిస్తున్న సమ్మెలో భాగంగా మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలు బుధవారం సిఎస్ పురంలో భిక్షాటన కార్యక్రమం చేపట్టారు. తహాశీల్దారు కార్యాలయం నుంచి భిక్షాటన ప్రారంభించి డిజిపేట రోడ్డు, బస్టాండ్ సెంటర్, పామూరు రోడ్డు, శివాలయం వీధి తదితర ప్రాంతాల్లో భిక్షాటన చేసి బస్టాండ్ సెంటర్లో మానవహారం నిర్వహించి నిరసన తెలియజేశారు. కొండయ్య మాట్లాడుతూ అంగన్వాడీల సమ్మెకు మద్దతుగా ఉద్యమ నిర్వహణ ఖర్చుల నిమిత్తం సంఘీభావ విరాళాలను ప్రకటిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకుడు ఇర్లా కొండయ్య, కెవిపిఎస్ నాయకులు బక్క జేసురత్నం, అంగన్వాడీ నాయకులు సిహెచ్ రఫియ, బి అనురాధ, కె పెద్దక్క, నారాయణమ్మ, కె వెంకట లక్ష్మమ్మ, ఎం మాధవి, జి నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

కంభం: స్థానిక కందులాపురం సెంటర్లో అంగన్వాడీలు దీక్ష నిర్వహించారు. ఈ శిబిరం వద్ద ప్రకాశం జిల్లా సిఐటియు నాయకులు కాలం సుబ్బారావు ప్రసంగించారు. అంగన్వాడీ సమస్యలు త్వరగా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ కార్యకర్తలపై బెదిరింపులు మానుకోవాలని, ప్రభుత్వం అంగన్వాడీ సమస్యలను పరిష్కరించని యెడల సమ్మెను ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సిఐటియు నాయకులు కాలం సుబ్బారావు, కంభం మండల సిఐటియు కన్వీనర్ అన్వర్ బాషా, కంభం మండల సిఐటియు నాయకులు దానం, అర్ధవీడు, కంభం, బేస్తవారిపేట, మండలాల అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

మార్కాపురం: సిఎం జగన్‌మోహన్‌రెడ్డిని తాము స్వయంగా కలుసుకోలేము... మంత్రిగా మీరు మాకు అందుబాటులో ఉన్నా... పోలీసుల వలయం దాటి కలవలేకపోతున్నాము... మీ ఇంటి గేటుకు తమ సమస్యలను అర్జీ ద్వారా తెలియజేసుకుంటున్నాము.. మాకు చాలీ చాలని వేతనాలతో జీవనం గడపం కష్టంగా ఉంది. జీతాలు పెంచాలని మా విన్నపం. ఇతర రాష్ట్రాల కంటే మా జీతాలు తక్కువగా ఉన్నాయి. సిఎం జగన్ గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అమలు చేయాలనే మేము కోరుతున్నాము. మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఇంటికి వచ్చినప్పుడు గేటుకు కట్టిన అర్జీని చూడగలరు. మా విన్నపాన్ని సిఎం జగన్ దృష్టికి తీసుకెళ్లగరని, మా సమస్యకు పరిష్కారం చూపగలరని మిక్కిలి విన్నపం... అంటూ అంగన్‌వాడీలు బుధవారం నాడు మార్కాపురంలోని మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఇంటి గేటుకు డిమాండ్లతో కూడిన అర్జీలు కట్టారు. అనంతరం మార్కాపురం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట రోజు మాదిరి గా అంగన్‌వాడీల ఆందోళన కొనసాగింది. ఆందోళనకు పి రూబెన్, జవ్వాజి రాజు, గుమ్మా బాలనాగయ్యలతో పాటు ప్రజా సంఘాల నాయకులు అండగా నిలిచారు.

టంగుటూరు: అంగన్వాడీల డిమాండ్ల సెగ కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి ఇంటిని తాకింది. బుధవారం అంగన్వాడీ కార్యకర్తలు, సిబ్బంది టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెంలోని ఎమ్మెల్యే డాక్టర్ స్వామి ఇంటిని ముట్టడించారు. ఎమ్మెల్యే ఇంటి ముందు బైఠాయించి తమ నిరసనను తెలియజేశారు. తమ సమ్మెను ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వం తరపున ఎమ్మెల్యే డాక్టర్ స్వామి జోక్యం చేసుకొని తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎమ్మెల్యే డా స్వామిని కలిసేందుకు అంగన్వాడీ సిబ్బంది గేటు చొచ్చుకొని లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. ఆ సమయంలో ఎమ్మెల్యే స్వామి ఇంటి వద్ద లేకపోవడంతో అక్కడే ఉన్న ఎమ్మెల్యే సిబ్బందికి అంగన్వాడీలు వినతిపత్రం సమర్పించి వెనుదిరిగారు.

ఎమ్మెల్యే ప్రభుత్వంతో చర్చించాలి: సిఐటియు నాయకులు శ్రీనివాసులు

అంగన్వాడీల సమస్యలపై ఉండే ఎమ్మెల్యే డాక్టర్ స్వామి ప్రభుత్వంతో చర్చించి పరిష్కరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి గంటెనపల్లి శ్రీనివాసులు పేర్కొన్నారు. అంగన్వాడీల సమస్యలపై కొండపి ఎమ్మెల్యే డాక్టర్ స్వామిని వివరణ కోరగా అంగన్వాడీలు తన ఇంటికి వచ్చే సమయంలో తాను అందుబాటులో ఉండనని తెలిసే వారు ఇంటి ముట్టడికి ప్రయత్నించారని, దీనిపై తానేమీ స్పందించనని అన్నారు.

మద్దిపాడు: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీలో స్థానిక ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు క్యాంప్ ఆఫీసును బుధవారం ముట్టడించారు. మల్లవరంలోని ఎమ్మెల్యే ఆఫీస్ వద్ద అంగన్వాడీలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసి తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యాలయంలో ఎమ్మెల్యే లేకపోవడంతో గోడకు నోటీసును అతికించి దీక్షా శిబిరం వద్దకు వెళ్లి తమ నిరసనను కొనసాగించారు. సమ్మెను ఉద్దేశించి అంగన్వాడీ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కే సుబ్బరావమ్మ మాట్లాడుతూ ప్రభుత్వం చర్చల పేరుతో పిలిచి కాలయాపన చేస్తుందో కానీ తమ సమస్యలను పరిష్కరించే విధంగా ఆలోచన చేయడం లేదని దుయ్యబట్టారు. ప్రభుత్వం దిగి వచ్చేంతవరకు సమ్మెను విరమించేది లేదని తేల్చి చెప్పారు. సమ్మెకు అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి అన్నపూర్ణ, ప్రశాంతి, సుబ్బమ్మ, కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శ్రీకాంత్ మద్దతు తెలిపారు. సిఐటియు నాయకులు బంకా సుబ్బారావు, ఆంజనేయులు, ఆదిలక్ష్మి, ధనలక్ష్మి, జయప్రద, లక్ష్మి, సుజాత, నాగలక్ష్మి అంగన్వాడీలు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

పెద్దదోర్నాల: పెద్ద దోర్నాలలో అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మెకు ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ దోర్నాల మండల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం సంపూర్ణ మద్దతు తెలిపారు. అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలు వెంటనే పరిష్కరించాలని తహశీల్దారు కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. తహశీల్దారు వేణుగోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నాయకురాళ్లు సిప్పోర, ప్రావీణ్య, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

కనిగిరి: అంగన్వాడీలు తమ సమస్యలు పరిష్కారం కోసం చేపట్టిన నిరసన కార్యక్రమం బుధవారానికి 16వ రోజుకు చేరుకుంది. నిరసనలో భాగంగా కనిగిరి, వెలిగండ్ల ప్రాజెక్టుల పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలు స్థానిక ఎమ్మెల్యే కార్యాలయాన్ని ముట్టడించారు. సిఐటియు నాయకులపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో సిఐటియు నాయకులు ఎమ్మెల్యే మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పీసీ కేశవరావు, జిల్లా నాయకులు ఆర్ మాలకొండయ్య, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు ఎస్ సుజాత, సీత, రజిని, భాగ్యలక్ష్మి, సౌందర్య, రామసుబ్బులు పాల్గొన్నారు.

కనిగిరిలో ఎమ్మెల్యే ఇంటిని ముట్టడించిన అంగన్‌వాడీలు

అంగన్వాడీలకు భవన నిర్మాణ కార్మిక సంఘం మద్దతు

ప్రజాశక్తి-కంభం

స్థానిక కందులాపురం సెంటర్‌లో గత పదహారు రోజులుగా అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు చేస్తున్న దీక్షకు భవన నిర్మాణ కార్మిక సంఘం మద్దతు ప్రకటించింది. బుధవారం కంభం మండల భవన నిర్మాణ కార్మిక సంఘం తరపున ఆ సంఘం నాయకులు అంగన్వాడీల దీక్షా శిబిరం వద్దకు చేరుకుని వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షులు బల్లారపు రోశయ్య మేస్త్రీ మాట్లాడుతూ అంగన్వాడీలు అడుగుతున్న వారి న్యాయమైన కోరికలను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని, వారి జీతాల పెంపునకు, గ్రాట్యూటీ చెల్లింపునకు ప్రభుత్వం సహకరించాలని వారు కోరారు. భవన నిర్మాణ కార్మిక సంఘం కంభం మండల కమిటీ ప్రధాన కార్యదర్శి షేక్ ఖాజావలి మేస్త్రీ మాట్లాడుతూ అంగన్వాడీ కార్యకర్తలు న్యాయమైన కోరికలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని అన్నారు. అంగన్వాడీల దీక్షకు చేదోడుగా 2 వేలు రూపాయల నగదును అంగన్వాడీలకు, భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం ఉపాధ్యక్షులు షేక్ మహబూబ్ బాషా మేస్త్రీ, కోశాధికారి నాగెళ్ల జర్మియ మేస్త్రీ, గౌరవ అధ్యక్షులు సయ్యద్ కొత్తూరు మేస్త్రీ, భవన నిర్మాణ కార్మిక సంఘం సభ్యులు నాసరవలి మేస్త్రీ, పిక్కిలి వెంకటేశ్వర్లు, మీనిగ చెన్నయ్య, రామకృష్ణ రావిపాడు, ఎం శ్రీను, సీఐటీయు కంభం మండల కన్వీనర్ అన్వర్‌బాషా, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీఐటియూ జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు

ఎమ్మెల్యే కార్యాలయం ముట్టడి

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

అంగన్వాడీల సమస్యలపై గిద్దలూరు శాసన సభ్యులు అన్నా వెంకట రాంబాబు జోక్యం చేసుకొని రాష్ట్ర ముఖ్య మంత్రితో సంప్రదింపులు జరిపి సమస్యను పరిష్కరించా లని డిమాండ్ చేస్తూ అన్నా రాంబాబు కార్యాలయాన్ని అంగన్వాడీలు ముట్టడి చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీలు గత 16 రోజుల నుంచి సమ్మె చేస్తుంటే ఈ రాష్ట్రంలో ఉన్న ఎమ్మెల్యేలు మంత్రులు చూస్తూ ఊరుకున్నారే తప్ప సమస్య పరిష్కారం చేయట్లేదని అన్నారు. ఏదో తూతూమంత్రంగా చర్చలు జరుపుతున్నారే తప్ప ప్రధానమైన డిమాండ్ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్‌ను మంత్రులు దాటవేస్తున్నారని అన్నారు. సమ్మెను ఎక్కువ కాలం కొనసాగిస్తే ప్రభుత్వానికే నష్టం వాటిల్లుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు డి స్వర్ణ, బేస్తవారిపేట ప్రాజెక్టు అధ్యక్షురాలు సరళదేవి, సిఐటియు నాయకులు టి ఆవులయ్య, వి నరసింహులు అంగన్వాడీలు పాల్గొన్నారు.

దర్శి: రాష్ట్ర వ్యాప్తంగా 16 రోజులుగా సమ్మె జరుగుతున్నప్పటికీ ప్రభుత్వం స్పందించలేదని, ప్రజా ప్రతినిధులను కూడా అడ్డుకుంటామని అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు కల్పన అన్నారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్ ఇంటి ముట్టడి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే ఇంటి వద్ద వందలాది మంది ఆందోళనకారులు మధ్యాహ్నం వరకు ముట్టడి చేశారు. ఆ సమయంలో ఎమ్మెల్యే ఇంట్లో లేరు. అనంతరం ఎమ్మెల్యే పీఏ వెంకట్‌కు రాష్ట్ర ఆక్వా అడ్వైజర్, వైసీపీ జిల్లా సాంస్కృతిక విభాగ అధ్యక్షులు షేక్ సైదాకు అంగన్‌వాడీ యూనియన్ నాయకులు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో తాండవ రంగారావు, సందు వెంకటేశ్వరరావు, కేవీ పిచ్చయ్య, అంగన్‌వాడీ నాయకులు అచ్చమాంబ, తిరుపతమ్మ, మల్లేశ్వరి పాల్గొన్నారు.

దర్శిలో ముట్టడి కార్యక్రమంలో పాల్గొన్న అంగన్‌వాడీలు

● ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర మహాసభల్లో..

కాకినాడలో జరిగిన ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర మహాసభల్లో పాల్గొన్న ప్రకాశం, బాపట్ల జిల్లాల ప్రతినిధులు

రూ.68 కోట్లతో మున్సిపల్ బడ్జెట్ ఆమోదం

కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపుపై చర్చ

ప్రజాశక్తి - చీరాల

మున్సిపల్ బడ్జెట్ సమావేశం ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. రూ.68కోట్లతో బడ్జెట్ ఆమోదించారు. మున్సిపల్ అకౌంటెంట్ రేఖ బడ్జెట్ వివరాలు ప్రవేశపెట్టారు. 2024 -25 సంవత్సరానికి రూ.11.11కోట్లు ప్రారంభ నిల్వ చూపారు. వివిధ పద్దుల కింద రూ.56.94కోట్లు, రూ.56.39కోట్లు వ్యయం చూపారు. రూ.11.66కోట్లు ముగింపు నిల్వ చూపారు. అభ్యంతరాలపై చర్చలు జరిగినప్పటికీ ప్రశాంతంగా బడ్జెట్ సమావేశం ప్రశాంతంగా ముగిసింది. అజెండాలో ప్రవేశపెట్టిన తొమ్మిది అంశాలను ఆమోదించారు. జీరో అవర్‌లో కౌన్సిలర్ కీర్తి వెంకట్రావు, కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు చెల్లించడం లేదని అన్నారు. ఇప్పటి వరకు రూ.2కోట్లకుపైగా కాంట్రాక్టర్లకు నిధులు బాకీ ఉన్నాయని, వెంటనే చెల్లించే విధంగా అధికారులు న్యాయం చేయాలని కోరారు. బిల్లులు సకాలంలో చెల్లించకపోతే అభివృద్ధి పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని అన్నారు. కమిషనర్ రామచంద్రరెడ్డి మాట్లాడుతూ బిల్లులకు ప్రపోజల్ పంపించామని తెలిపారు. జనవరి నుండి మార్చిలోపు బిల్లుల సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు. ఫైర్ స్టేషన్ గేటు వద్ద నూతనంగా నిర్మించనున్న ఆర్‌ఓబికి భూమి పూజ ఎన్నికల కోడ్‌కు ముందే చేసే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలని ఛైర్మన్ శ్రీనివాసరావు కోరారు. టిపిఎస్ అధికారులు మాట్లాడుతూ ఈపాటికే కొలతలు పూర్తి చేశామని తెలిపారు. మ్యాపింగ్ కూడా సిద్ధం చేశామని అన్నారు. ఆర్ అండ్‌బి అధికారుల పరిశీలనలో ఉన్నట్లు తెలిపారు. కౌన్సిలర్లకు గౌరవ వేతనాలు సకాలంలో రావటం లేదని గుంటూరు ప్రభాకరరావు కౌన్సిల్ దృష్టికి తీసుకువచ్చారు. గౌరవ వేతనాలు అన్ని సిఎఫ్ఎం ద్వారా రావలసి ఉన్నందున ప్రతిపాదనలు పంపించినట్లు కమిషనర్ తెలిపారు. త్వరలోనే సభ్యుల గౌరవ వేతనాలు ఖాతాల్లో జమవుతాయని తెలిపారు. కౌన్సిలర్ బత్తుల అనిల్ మాట్లాడుతూ వాటిలో సమస్యలు ఏమైనా ఉంటే సంబంధిత అధికార దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సోషల్ మీడియాలో పోస్టులు పెడుతూ పాలనను ప్రశ్నించే విధంగా వీడియోలు పోస్ట్ చేయడం మంచి పద్ధతి కాదని అన్నారు. మున్సిపల్ కార్మికులు సమ్మెలో ఉన్నట్లు అందరికీ తెలుసని అన్నారు. పారిశుధ్యంపై ఆ విధంగా పోస్టులు పెట్టడం సరైనది కాదని కౌన్సిలర్ సల్లూరి సత్యానందంను ఉద్దేశించి అన్నారు. అందుకు సత్యానందం స్పందించారు. తమ వార్డులో జరిగిన అభివృద్ధి పనులేమిటో తెలపాలని కోరారు. వార్డులోని సమస్యలపైన తాను పోస్ట్ చేశానని అన్నారు. వ్యక్తిగతంగా కాదు అంటూ వివరణ ఇచ్చారు. అభివృద్ధి పనుల వివరాలు చెప్పేందుకు తాము సిద్ధమైనేనే బత్తుల అనిల్ అన్నారు. అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి పెద్దపేట వేస్తున్నారని అన్నారు. నూతన సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా స్నేహపూర్వక వాతావరణంలో అభివృద్ధికి అందరు కృషి చేయాలని ఛైర్మన్ కోరారు.

కౌన్సిల్ సమావేశంలో ఛైర్మన్ జంజనం శ్రీనివాసరావు

వైసిపి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న పాలెపోగు రాంబాబు

వైసిపిలో చేరిన 34 కుటుంబాలు

ప్రజాశక్తి - యద్దనపూడి

మండలం యనమదల పంచాయతీ చింతపల్లిపాడు గ్రామంలో ఎస్‌సి సామాజిక వర్గానికి చెందిన 34కుటుంబాలు జగనన్న సంక్షేమ పాలన నచ్చి వైసిపిలో చేరారు. వైసిపి ఎస్‌సి సెల్ అధ్యక్షులు పాలెపోగు రాంబాబు ఆధ్వర్యంలో వైసిపి కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల ప్రజా పరిషత్ ఉపాధ్యక్షులు ఐమాల శ్యాంసన్, వైసిపి సీనియర్ నాయకులు చిలుకూరి క్రిష్టయ్య చౌదరి, సర్పంచుల సంఘం నియోజకవర్గ అధ్యక్షులు, దగ్గుబాడు సర్పంచ్ గేరా రవీంద్రనాథ్ ఠాగూర్, యనమదల సర్పంచ్ రాయి పృథ్వి రాజ్, ఉపసర్పంచ్ ఐమాల గంగయ్య, జంపని రాజేష్, ఐమాల చిన తిరుపతయ్య, అట్లూరి నాగేశ్వరరావు, కొలకలమూడి కోటయ్య, ఐమాల నతానియేలు, అమర్తపూడి కోటయ్య, గడ్డం పుల్లారావు, దుడ్డు సుబ్బారావు, అట్లూరి వీరయ్య, ఐమాల జయమణి, సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ మున్నంగి వీరయ్య, పులగం చందు, పాలెపోగు పవన్ పాల్గొన్నారు.

పాఠశాలకు రోడ్డు నిర్మించాలి

ప్రజాశక్తి - చుండూరు

స్థానిక అంబేద్కర్ నగర్ గ్రామంలోని బాలుర గురుకుల పాఠశా ల్లో ఆడదాం ఆంధ్ర ఆటల పోటీలు నిర్వహించారు. పోటీల్లో మున్నంగి వారి పాలెం, అంబేద్కర్ నగర్, తొట్టెంపూడి గ్రామాల్లోని యువ క్రీడాకారులు వాలీబాల్, కోకో, కబడి క్రీడలు ఆడారు. అయితే గురుకుల పాఠశాలకు వెళ్లే దారి గుంటతో రాకపోకలకు ఇబ్బందిగా ఉందని ఉపాధ్యాయులు కోరారు.

నూతన షాపు ప్రారంభం

ప్రజాశక్తి - మేదరమెట్ల

షాపు ప్రారంభిస్తున్న హనిమిరెడ్డి

కొరిశపాడు మండలంలోని బొడ్డువానిపాలెం గ్రామంలో శుభ ఎంటర్ప్రైజెస్ నూతన షాపును ఇంచార్జ్ పి అనిమిరెడ్డి బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి అన్నం అంజిరెడ్డి, ఉప సర్పంచ్ అన్నెం అంజిరెడ్డి పాల్గొన్నారు.

'కక్ష సాధింపు రాజకీయం'

ప్రజాశక్తి - రేపల్లె

రాజకీయాల్లో వ్యక్తి గత దూషణలు, కక్ష సాధింపు ఇప్పుడు కార్యక్రమం మారిందని, అనుచిత వ్యాఖ్యలు చేయడం కరెక్ట్ కాదని వైసిపి నాయకులు, న్యాయవాది బొర్రా శ్రీనివాసరావు అన్నారు. టిడిపి ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ సోషల్ మీడియా వేదికగా తనపై వ్యక్తిగత దూషణలకు పాల్పడటం పట్ల అసహనం వ్యక్తం చేశారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగు రోజుల క్రితం ఎమ్మెల్యే సత్యప్రసాద్ వైసిపిని రాష్ట్రం నుండి తరిమేస్తామని మాట్లాడటాన్ని ఖండించారు. టిడిపి సోషల్ మీడియా తనను టార్గెట్ చేస్తే వైసిపి సోషల్ మీడియా స్పందించడం లేదని ప్రశ్నించారు. స్థానిక వైసిపి నాయకులు ఆధిపత్యం కోసం మాత్రమే పనిచేస్తున్నారని ఘాటు వ్యాఖ్యలు చేశారు. వైసిపి సోషల్ మీడియా వ్యక్తుల కోసం పనిచేస్తుందా, వ్యవస్థ కోసం పనిచేస్తుందాని ప్రశ్నించారు.

రిజిస్టర్‌లో నమోదు చేయాలి

ప్రజాశక్తి - అద్దంకి : మండలంలోని ఉద్యోగులు అందరూ తమ సెలవులు పొందటం హక్కు, గనుక రిజిస్టర్‌లో నమోదు చేయాలని గ్రామ, వార్డు వెల్ఫేర్ ఆర్గనైజేషన్ యూనియన్ విజ్ఞప్తి చేశారు. సచివాలయ ఉద్యోగులు రావలసిన హక్కులను పొందవలసినదిగా ప్రెసిడెంట్ రామయ్య, జిల్లా సెక్రెటరీ హరి కోరారు.

తెలుగు మహాసభల కరపత్ర ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

జనవరి 5, 6, 7తేదీల్లో రాజమహేంద్రవరంలో జరుగనున్న అంతర్జాతీయ తెలుగు మహాసభల కరపత్రాన్ని మడగాస్కర్ దేశ భారత రాయబారి, కస్టమ్స్ అండ్ సెంట్రల్ ఎక్సైజ్ జాయింట్ కమిషనర్ బండారు రత్న కిషోర్ మండలం ఇడుపులపాడులో బుధవారం ఆవిష్కరించారు. ఆంధ్ర సారస్వత పరిషత్, చైతన్య విద్యా సంస్థలు సంయుక్తంగా నిర్వహిస్తున్న తెలుగు మహాసభలకు హాజరు కావాలని కోరారు. మహాసభల జిల్లా సంచాలకులు పిడపర్తి పేరిరెడ్డి మాట్లాడుతూ తెలుగు భాషా వైభవాన్ని, తెలుగు జాతి సంస్కృతీ, సంప్రదాయాన్ని ప్రపంచానికి చాటే విధంగా మూడు రోజుల పాటు జరిగే మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. సభల్లో గజల్ గాయకులు గజల్ శ్రీనివాస్ నిర్వహణలో ఆంధ్ర సారస్వత పరిషత్తు సంచాలకులు కేసిరాజు రామప్రసాద్ పర్యవేక్షణలో సాహితీ ప్రక్రియలపై సదస్సులు, కవిసమ్మేళనం, కథా పఠనం, సాంస్కృతిక కార్యక్రమాలు, కళారూపాలు వంటి అనేక కార్యక్రమాలు వుంటాయన్నారు. 70దేశాల నుండి ప్రతినిధులు, లక్షల మంది సాహితీ ప్రియులు పాల్గొంటారని తెలిపారు. నాలుగు రాష్ట్రాల గవర్నర్లను, రెండు తెలుగు రాష్ట్రాల సిఎంలను, మంత్రులను, పీఠాధిపతులను, సాహితీవేత్తలను ఆహ్వానించామని తెలిపారు. కార్యక్రమంలో అంబటి సురేష్, కంభంపాటి నరసయ్య పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరిస్తున్న బండారు రత్నకిషోర్

పశుపోషకుల సమావేశంలో డిడి డాక్టర్ రమేష్

కృత్రిమ దూడల ప్రదర్శన

ప్రజాశక్తి - అద్దంకి

ప్రభుత్వం పశు సంవర్థక శాఖ పశు గణాభివృద్ధి సమస్త ఆధ్వర్యంలో పశు కృత్రిమ గర్భధారణలో పుట్టిన లేగ దూడల ప్రదర్శన దేనువకొండలో ఎడి మోహనరావు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిడి డాక్టర్ రమేష్ మాట్లాడుతూ కృత్రిమ గర్భధారణ ద్వారా పుట్టిన లేగ దూడలు ఆరోగ్యంగా ఉన్నాయని అన్నారు. పశుపోషకులు పాడి గేదెలను రోగాల బారిన పడకుండా నాణ్యమైన పశు దానాన్ని అందించాలని అన్నారు. తద్వారా పాల ఉత్పత్తి పెరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో ఈఒ డాక్టర్ కాలేషా, డాక్టర్ అశోక్, డాక్టర్ కృపారావు హాజరయ్యారు.

కుష్ఠువ్యాధి నిర్మూలనకు సర్వే

ప్రజాశక్తి - బాపట్ల

జిల్లాలో కుష్ఠు వ్యాధిని సమూలంగా రూపుమాపేందుకు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు వైద్య ఆరోగ్య శాఖ జిల్లా అధికారి ఎస్ విజయమ్మ విలేకరులకు తెలిపారు. జిల్లా కుష్ఠు, ఎయిడ్స్, క్షయ వ్యాధి నిర్మూలన అధికారి సివి రమాదేవి పర్యవేక్షణలో జిల్లాలో ఈనెల 27నుండి వచ్చే జనవరి 12వరకు కుష్ఠువ్యాధి గుర్తించేందుకు ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటి సర్వే నిర్వహిస్తారని తెలిపారు. సర్వేలో ఆశా కార్యకర్త, వాలంటీర్ టీంగా ప్రతి ఇంటికీ వెళ్ళి కుష్ఠు వ్యాధి లక్షణాలు గుర్తిస్తారని తెలిపారు. లక్షణాలు కనిపిస్తే వైద్య పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారించి, నివారణకు అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేస్తారని తెలిపారు. వైద్య పరీక్షలకు ప్రజలు సహకరించాలని కోరారు.

పేదలకు దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి - కొండపి

క్రిస్మస్ పండుగ సందర్భంగా పేదవారైన వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు బట్టలు పంపిణీ చేయడం ఎంతో గొప్పవిషయమని పెరిదేపి గ్రామవాసులు తెలిపారు. గ్రామానికి చెందిన జెడా ఎలీషా, అనుపమా దంపతులు తన కుమారుడు అభిషేక్ పుట్టిన రోజు సందర్భంగా గ్రామంలోని పేదలకు బట్టలు పంపిణీ చేశారు. ప్రతి ఏటా పంపిణీ చేస్తామని ఎలీషా అన్నారు. గత 23ఏళ్ల నుండి బట్టలు పంపిణీ, క్రిస్మస్ వేడుకలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాస్టర్ జెకెక్, గ్రామ పెద్దలైన అంగలకుర్తి చినబ్రహ్మయ్య, మల్లెల చిన పేతురు, అంగలకుర్తి ఏసువర్ధన్, పెద బ్రహ్మయ్య, అంగలకుర్తి జేమ్స్, అంగలకుర్తి ఇస్మాయిల్ పాల్గొన్నారు.

మహమ్మద్‌కు అండగా నిలుస్తాం

ప్రజాశక్తి - శింగరాయకొండ

నగదు అందజేస్తున్న ప్రిన్సిపాల్ తాజ్

మండలంలోని సోమరాజు పల్లి పంచాయతీ టిపి నగర్‌కి చెందిన షేక్ మహమ్మద్ ప్రమాద వశాత్తు సాంబార్‌లో పడి గాయపడ్డ అతని కోసం విద్యాసంస్థలు కదిలాయి. స్థానిక గీతం విద్యా సంస్థల యాజమాన్యం, సిబ్బంది తమవంతుగా ప్రిన్సిపాల్ తాజ్, ఇన్చార్జ్ రాణి, షాజ, సాయి అరుణ, ఖాజాబీ, నాగమణి చేతుల మీదగా రూ.75వేలు సహాయం అందించారు. దాతలు స్పందించి ఆ బాబును ఆదుకోవాలని గీతం సంస్థ ఛైర్మన్ లక్ష్మణరావు కోరారు. నెల్లూరుకు చెందిన ఆల్వా మెరైన్ హెల్పింగ్ ఫ్రెండ్స్ కంపెనీ కార్మికులతో కలిపి రూ.38వేలను అందజేశారు. శింగరాయకొండ అప్పేట్స్ నుంచి సహాయాన్ని అందించేందుకు కృషి చేస్తున్నారు. మలినేని విద్యా సంస్థల ఛైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్ళ ఆధ్వర్యంలో రూ.25వేలు సహాయాన్ని అందజేస్తున్నామని ప్రజాశక్తికి తెలిపారు.

ఈ క్రాప్ నమోదు చేయించుకోవాలి

ప్రజాశక్తి - బేస్తవారిపేట

పంటలను సాగుచేసిన ప్రతి రైతు ఈ క్రాఫ్ నమోదు చేయించుకోవాలని గిద్దలూరు ఎడిఎ డి బాలాజీ నాయక్ పేర్కొన్నారు. కోనపల్లిలో వేరుశనగ, మొక్కజొన్న, జొన్న పైర్లను ఆయన బుధవారం పరిశీలించారు. సస్యరక్షణ చర్యలపై రైతులకు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎఒ జక్కం మెర్సి, ఎఇఒ షేక్ బాషా పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత

ప్రజాశక్తి - పొదిలి

చీమకుర్తి బూచేపల్లి వెంకాయమ్మ, సుబ్బారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు బుధవారం స్టడీ మెటీరియల్ 200మంది విద్యార్థులకు ఎంఈఒ శ్రీనివాసరెడ్డి అందించారు. దాతత్వం ప్రదర్శించిన బూచపల్లి చారిటబుల్ ట్రస్ట్‌కు వారి కుటుంబ సభ్యులకు కతజ్ఞతలు తెలిపారు. హెచ్‌ఎం పఠాన్ కరిమున్ బీబీ, ఎన్‌విఎస్ కుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు బివి రెడ్డి, ఒబుల్‌రెడ్డి, శ్రీహరి, శైలజ పాల్గొన్నారు.

క్రిష్ణమోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - పొదిలి

కేక్ కట్ చేస్తున్న వైసిపి నేతలు

మార్కాపురం ఎంఎల్ఎ కుందురు నాగార్జున స్థానిక వైసిపి కార్యాలయంలో నగర పంచాయతీ వైసిపి అధ్యక్షులు షేక్ నూర్జహాన్ బేగం ఆధ్వర్యంలో ఎంఎల్ఎ సోదరులు కెపి కష్ణమోహన్‌రెడ్డి జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేశారు. వైసిపి నాయకులు సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, గొలమారి చెన్నారెడ్డి, జూపల్లి ఏడుకొండలు, దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి, కల్లం సుబ్బారెడ్డి, యక్కలి శేషగిరిరావు, జి శ్రీను, పులగొర్ల శ్రీనివాసులు, ఎస్‌కె మస్తాన్‌వలి, వర్దం ఫిరోజ్, పేరం కోదండ రామిరెడ్డి, వర్దం ఫిరోజ్, దోర్నాల చిన్న నారాయణ రెడ్డి, మాదాలవారిపాలెం సహకార సంఘం అధ్యక్షులు ఆనికాళ్ల ఈశ్వరరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

కార్నియా సేకరిస్తున్న శంకర్ నేత్రాలయ వైద్యులు

రోటరీ ఆధ్వర్యంలో నేత్రదానం

ప్రజాశక్తి - పంగులూరు

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పంగులూరు గ్రామంలో బుధవారం 30వ నేత్రదానం చేశారు. గ్రామానికి చెందిన షేక్ ఖాసింబి (80) వృద్ధాప్యం వల్ల మృతి చెందారు. ఆమె కుటుంబ సభ్యులకు నేత్ర దానంపై రోటరీ అధ్యక్షులు హనుమంతరావు, సెక్రెటరీ గుర్రం ఆంజనేయులు, డిస్టిక్ చైర్మన్ చిలుకూరి వీరరాఘవయ్య, మాజీ అధ్యక్షులు రాయిని వెంకట సుబ్బారావు అవగాహన కల్పించారు. నేత్రదానం చేసేందుకు ప్రోత్సహించారు. ఆమె కుటుంబ సభ్యులు అంగీకరించటంతో కాకాని శంకర్ కంటి వైద్య నిపుణులు వచ్చి ఖాసింబి కార్నియాల సేకరించారు. నేత్రదానం చేసేందుకు అంగీకరించిన ఖాశింబి కుటుంబ సభ్యులను రోటరీ క్లబ్ సభ్యులు అభినందించారు.

రాష్ట్ర సమావేశంలో ఎంపిపి డివి లలితకుమారి

వైసిపి పాలనలో ఎస్సీలకు పెద్దపీట

ప్రజాశక్తి - భట్టిప్రోలు

వైసిపి ఎస్సి సెల్ సమావేశం బుధవారం తాడేపల్లిలో బుధవారం నిర్వహించారు. బట్టిప్రోలు, వేమూరు, చుండూరు ఎంపిపిలు డివి లలిత కుమారి, ఎల్లమాటి మోహన్, జె రూబేను హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీల అభివృద్ధి వైసీపీ పాలనలోనే కొనసాగిందని అన్నారు. దళిత గిరిజనులకు సిఎం జగన్మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని అన్నారు. వారి అభ్యున్నతికి కృషి చేశారని కొనియాడారు.

లైబ్రరీలో గ్రూప్-2 మెటీరియల్

ప్రజాశక్తి - కొల్లూరు

మండలంలో అనంతవరం గ్రంథాలయంలో గ్రూప్ 2 పరీక్షలకు అవసరమైన మెటీరియల్‌ను జిల్లా శాఖ గ్రంథాలయం సమకూర్చినట్లు గ్రంద పాలకులు కనకదుర్గ తెలిపారు. జాయింట్ కలెక్టర్ రాజ్ కుమారి, గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి కందుల ఝాన్సీలక్ష్మి చేతుల మీదుగా లీడర్స్ ఆన్ డిమాండ్ పుస్తకాలను అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రూప్ 2 పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు తమ గ్రంథాలయంలో ఉన్నాయని తెలిపారు. పాఠకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సమావేశంలో ఎంపి విజయసాయిరెడ్డి, మంత్రి సురేష్

సురేష్ గెలుపునకు కృషి చేయాలి

ప్రజాశక్తి - కొండపి

నియోజకవర్గంలోని వైసిపి నాయకులందరు సమన్వయంతో నూతన ఇన్‌ఛార్జి, పురపాలక శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ గెలుపుకు కృషి చేయాలని రీజనల్ కో ఆర్డినేటర్, ఎంపి విజయసాయిరెడ్డి అన్నారు. తాడేపల్లిలో బాలినేని వాసు. మాజి ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు, మాజీ పిడిసిసి బ్యాంకు చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య, జూపూడి ప్రభాకర్‌తో కలిసి చర్చించారు. నియోజకవర్గంలో ఎటువంటి అరమరికలు లేకుండా అందరిని కలుపుకొని పోవాలని మంత్రి సురేష్‌కు సూచించారు. వైసిపి గెలుపు కోసం ప్రణాళిక రూపొందించారు. సమన్వయంతో పనిచేయాలన్నారు.

భూ హక్కు చట్టం రద్దు చేయాలి

కోర్టు విధులు బహిష్కరించిన న్యాయవాదులు

ప్రజాశక్తి - బాపట్ల

రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన ఎపి భూ హక్కుల చట్టం తక్షణమే రద్దు చేయాలని కోరుతూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు బుధవారం కోర్టు విధులను బహిష్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భీమా లీలాకృష్ణ ఆధ్వర్యంలో ఆర్డీఒకు వినతి పత్రం అందజేశారు. భూ హక్కుల చట్టంతో నష్టపోయే విధానాన్ని తెలియజేస్తూ పట్టణంలో వినూత్న ప్రదర్శన చేశారు. స్థానిక పాతబస్టాండ్ సెంటర్‌లో న్యాయవాదులు మానవహారంగా ఏర్పాటై భూ హక్కుల చట్టం రద్దు చేయాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి ఇమ్మడిశెట్టి బాలకృష్ణ, సీనియర్ న్యాయవాదులు జడ్ భాషా, నల్లమోతు సుబ్బారావు, దుద్దుకూరి శ్రీరామమూర్తి, సిహెచ్ నాగయ్య, ఫిలిప్, వై

విధులు బహిష్కరిస్తున్న న్యాయవాదులు

నరేష్ బాబు, ఐ సురేష్ బాబు, లేళ్ళ శ్రీనివాసరావు, బి కమలకుమార్, వై సతీష్ రాజా, స్టాలిన్, విమల్ కుమార్, డి కిరణ్ కుమార్, కె రవిబాబు, డిహెచ్ బెంజ్, తోట రామాంజనేయులు, షేక్ మన్సూర్, సిహెచ్ శరత్ చంద్ర, బండి రామ్మూర్తి, మహిళా న్యాయవాదులు ఉషారాణి, నాగమోహిని, మాధురి, ఆకాంక్ష పాల్గొన్నారు.

ఉర్దూ కవి సామ్రాట్ గాలిబ్‌కు నివాళి

ప్రజాశక్తి - బాపట్ల రూరల్

మహాకవి గాలిబ్ 226వ జయంతి సభ సాహితీ భారతి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. సభకు ప్రముఖ ఉర్దూ సాహితివేత్త షేక్ ఖాసిం సాహెబ్ హాజరై మాట్లాడారు. గాలిబ్ రచించిన దీవానా ఏ గాలిబ్ అనే గ్రంథం ప్రపంచంలోని అనేక భాషల్లోకి అనువదింపబడినదని తెలిపారు. గాలిబ్ ఫారసీ భాషలో 11000లకుపైగా, ఉర్దూ భాషలో 1700లకుపైగా కవితలు రచించారిన తెలిపారు. విశ్వసాహితీ జగత్తులో చిరస్థాయిగా నిలిచిపోయారని ప్రశంసించారు. ఈ సభకు అధ్యక్షత వహించిన రావూరి నరసింహ వర్మ మాట్లాడుతూ గాలిబ్ రచనలు తెలుగులో గాలిబ్ గీతాలు పేరుతో దాశరధి అనువదించారని తెలిపారు. డాక్టర్ సి నారాయణరెడ్డి గాలిబ్ గజళ్ళ ప్రేరణతో తెలుగులో కూడా గజల్ ప్రక్రియను ప్రవేశపెట్టారని తెలిపారు. ప్రముఖ హిందీ పండితులు అబ్దుల్ ఖాదర్ జిలాని మాట్లాడుతూ ఉర్దూ భాషలో గజల్ ప్రక్రియను గాలిబ్ అత్యంత

కవిసామ్రాట్ గాలిక్‌కు నివాళి అర్పిస్తున్న సాహితీవేత్తలు

ప్రజాదరణ పొందే విధంగా మలచారని అన్నారు. కవితలతోపాటు లేఖలు కూడా గొప్ప సాహిత్య సంపదగా కొనియాడ పడుతున్నాయని అన్నారు. గాలిబ్ గజళ్ళలో ప్రేమ, విరహ భావాలు బాహ్యానికి ప్రకటితమవుతున్నా అంతర్లీనంగా అద్భుతమైన తాత్వికత, ఆధ్యాత్మికత దాగి ఉంటుందని అన్నారు. సభలో మర్రి మల్యాద్రిరావు, ఎన్ కృష్ణ, ఆదం షఫీ, ఎం జాకబ్, కస్తూరి శ్రీనివాసరావు, బొడ్డుపల్లి శ్రీరామ చంద్ర మూర్తి పాల్గొన్నారు.

గణేష్ విజయానికి కృషి చేయాలి

ప్రజాశక్తి - రేపల్లె

వైసిపి అధిష్టానం నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా నియతులైన డాక్టర్ ఈవూరి గణేష్ విజయానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణారావు సూచించారు. పట్టణంలో ఏర్పాటు చేసిన పరిచయ సభలో గణేష్‌ను ప్రతి నాయకునికి పరిచయం చేశారు. సిఎం వైఎస్ జగన్ వై నాట్ 175 సీట్లు సాధించాలని దృక్పథంతో కుల సమీకరణలో భాగంగా గణేష్‌కు ఇన్‌ఛార్జిగా పదవి అప్పగించారని మరోసారి

డాక్టర్ గణేష్‌ను పరిచయం చేస్తున్న మోపిదేవి

సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయబోతున్నారని అన్నారు. అండగా ఉండి గణేష్ విజయానికి కృషిచేసి, జగనన్నను సిఎం చేసుకోవడానికి పనిచేయాలని తెలిపారు. నూతన ఇన్‌ఛార్జి డాక్టర్ గణేష్ మాట్లాడుతూ నియోజకవర్గంలో వైసిపి జెండాను ఎగరవేస్తామని అన్నారు. ప్రతి గ్రామంలో మోపిదేవి సహకారంతో ప్రతి గృహాన్ని సందర్శించి, వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటామని తెలిపారు.

ఉద్యోగుల పోరుబాట : యుటిఎఫ్

ప్రజాశక్తి - పొదిలి

ప్రతినెలా 1వ తేదీ జీతాలు, పిఆర్సి, డీఏలు, పిఎఫ్, ఏపీజిఎల్ఐ ఇతర బకాయిల సాధనకై యుటీఎఫ్ పోరుబాటను విజయవంతం చేయాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పెమ్మని బాలవెంకటేశ్వర్లు కోరారు. స్థానిక తాసిల్దార్ కార్యాలయ ఆవరణలో నిరసన తెలిపారు. అధికారానికి వస్తే ప్రతి నెల 1న జీతం, మెరుగైన పిఆర్సి, సకాలంలో డిఏలు, ఉద్యోగ, ఉపాధ్యాయులతో స్నేహ పూర్వక వాతావరణం అంటూ 2019ఎన్నికల సందర్భంగా సిఎం చెప్పిన మాటలకు నేడు భిన్నంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. 17వ తేదీ వరకు జీతాలు, పెన్షన్ కోసం ఎదురుచూస్తున్న దుస్థితి ఏర్పడిందని అన్నారు. సకాలంలో జీతాలు రాకపోవడంతో బ్యాంకుల్లో చేసిన అప్పులకు జరిమానాలు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది అన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు దాచుకున్న పిఎఫ్, ఏపీజిఎల్ఐ, సరెండర్ లీవులు సకాలంలో చెల్లించకుండా దీర్ఘకాలంగా పెండింగ్లో పెట్టడం దుర్మార్గమన్నారు. సకాలంలో డిఎల్ ప్రకటించపోగా అప్పుడప్పుడు ప్రకటించిన వాటికి అరియర్స్ ఎప్పుడు చెల్లిస్తారో తెలియదు అన్నారు. ఆగస్టు 24న జరిగిన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో సెప్టెంబర్ 2023నాటికి అన్ని బకాయిలు చెల్లిస్తామని హామీ ఇచ్చిన ఇంతవరకు చెల్లింపులు జరగలేదన్నారు. రాబోయే నెలలో చెల్లిస్తామంటూ దాటవేస్తున్నారని అన్నారు. దీనిపై ఒక స్పష్టమైన విధివిధానాలు లేకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం అన్నారు. పిఆర్సి అరియర్స్ రూ.6246కోట్లు, డిఏ అరియర్స్ రూ.1136కోట్లు, కొత్తగా మంజూరైన రెండు డిఏల అరియర్లు రూ.2500కోట్లు, పిఎఫ్‌లోన్లు ఫైనల్ సెటిల్మెంట్లు రూ.1000కోట్లు, సరెండర్ లీవుల అరియర్లు రూ.250కోట్లు, ఏపీ జిఎల్ఐ లోన్లు ఫైనల్ పేమెంట్లు రూ.230కోట్లతో మొత్తం రూ.11,462కోట్లు ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించాల్సిందే అన్నారు. డిసెంబర్ 18నుండి జరుగుతున్న పోరుబాటలో భాగంగా ఈనెల 27న తాలూకా డివిజన్ కేంద్రాల్లో 6 గంటలకు ధర్నా కార్యక్రమానికి పిలుపునిచ్చినట్లు తెలిపారు. జనవరి 3న జిల్లా కేంద్రాల్లో 12గంటల ధర్నా, జనవరి 7, 8తేదీల్లో రాష్ట్ర కేంద్రంలో 36గంటల ధర్నా విజయవంతం చేయాలని కోరారు.

అశోక్‌బాబును సత్కరిస్తున్న విభిన్న ప్రతిభావంతులు

వరికూటికి ఆహ్వానం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మా నమ్మకం నువ్వే జగన్ అనే నినాదంతో జనవరి 4న నిజాంపట్నం తహభశీల్దారు కార్యాలయం వద్ద జరిగే సమావేశానికి హాజరు కావాలని వికలాంగ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు చల్లా రామయ్య వైసిపీ ఇంచార్జ్ వరికూటి అశోక్ బాబును ఆహ్వానించారు. ప్రపంచం బ్రేయిలి అందుల, వికలాంగుల దినోత్సవన్ని పురస్కరించుకొని జిల్లాలో రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రమణారావు సహకారంతో నిజాంపట్నంలో సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రేపల్లె వైసిపి ఇంచార్జ్ డాక్టర్ ఈవూరు గణేష్, అద్దంకి ఇంచార్జ్ పాణ్యం హనీమిరెడ్డినీ ఆహ్వానించినట్లు చెప్పారు. కార్యక్రమంలో దివ్యంగుల సంఘం నాయకులు పిటా నాగార్జున, అక్కల కృష్ణారెడ్డి, వెంకటేశ్వరరావు ఉన్నారు.

బాబుషూరిటీ కరపత్రాలు పంపుతున్న టిడిపి నేతలు

బాబుతోనే యువతకు భవిత

ప్రజాశక్తి - బాపట్ల

బాబు షఉరిటీతోనే యువతకు భవితని టిడిపి ఇన్ఛార్జి వేగేశన నరేంద్ర వర్మ అన్నారు. బాబు షఉరిటీ కార్యక్రమాన్ని మండలంలోని పూండ్ల గ్రామంలో బుధవారం నిర్వహించారు. ప్రతి ఇంటికి టిడిపిని చేరువ చేయడమే లక్ష్యంగా ఇంటింటికి టిడిపి, మీ మాటే – నా బాట, భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళలకు చీర, సంచి పంపిణీ చేశారు.

పాస్టర్స్ ఫెలోషిప్ కార్యవర్గం ఎంపిక

ప్రజాశక్తి - రేపల్లె

పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గం ఎంపిక చేసినట్లు కార్యదర్శి కొండమూరి శామ్యూల్ తెలిపారు. గ్లోరియస్ మినిస్ట్రీస్ దైవసేవకులు పాస్టర్ వినయ్ మాథ్యూస్ ద్వారా సభ్యులకు గుర్తింపు కార్డులు అందజేశారు. అధ్యక్షుడుగా పాస్టర్ కొండేటి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా చినిగే సురేష్ బాబు, జాయింట్ సెక్రెటరీ పేకలా షారోన్ రాజు, ట్రెజరర్ వక్కపట్ల దినేష్ ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో కొంగల ఇమ్మానుయేల్, మేడా జాన్ బాబు, గుజ్జర్లమూడి సంపత్ కుమార్, ప్రతాప్, ఆలా మోషే, లీగల్ అడ్వైసర్ దారా సాంబశివరావు పాల్గొన్నారు.

వైసిపి జెండా ఎగరవేయాలి

ప్రజాశక్తి - కొండపి

నియెజకవర్గంలో వైసిపి జెండా ఎగరవేసి జగనన్నకు కానుకగా ఇవ్వలని మండల సీనియర్ నాయకులు, సొసైటి అద్యక్షులు బొక్కిసం ఉపేంద్ర చౌదరి, దివి శ్రీనివా సులు, రావెళ్ల రాజీవ్‌చౌదరి మంత్రి సురేష్‌తో కలిసి మాట్లాడారు. తాడేపల్లి వైసిపి కార్యాలయంలో మంత్రి ఆదిమూలపు సురేష్‌తో నియోజకవర్గం ఎలా ఎన్నికలకు సన్నద్ధం కావాలనే దానిపై చర్చించారు. అదేవిదంగా విజయసాయిరెడ్డిని, జూపూడి ప్రభాకర్‌ను కలిసి చర్చించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు వసంతరావు పాల్గొన్నారు.

సురేష్‌తో వైసిపి నాయకులు

వచ్చే ఎన్నికల్లో..

పోటీ నుంచి తప్పుకుంటున్నా..!

- ఆరోగ్య సమస్యలే కారణం
- 'మాగుంట'ను ఓడించేందుకు పని చేస్తా..
- గిద్దలూరు ఎమ్మెల్యే 'అన్నా' వ్యాఖ్యలు

ప్రజాశక్తి-మార్కాపురం

వచ్చే ఎన్నికల్లో పోటీ నుంచి తాను తప్పుకుంటున్నానని, గిద్దలూరే కాదు.. మరెక్కడ నుంచీ వచ్చే ఎన్నికల్లో పోటీ చేయబోనని గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు తెలిపారు. మార్కాపురంలోని ఆయన నివాసగృహంలో బుధవారం సాయంత్రం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో 'అన్నా' సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆయన మాట్లాడుతూ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి 2024లో గిద్దలూరు బరిలో నిలవాలని ఈ పాటికే ఆదేశించినట్లు చెప్పారు. కానీ ఆయన మాటను కాదంటున్నందుకు తనను మన్నించాలని వేడుకున్నారు. తాను వైసిపి కార్యకర్తగా కొనసాగుతానని, జగన్ వెంటే నడుస్తానని చెప్పారు. ఇదే క్రమంలో మాగుంట కుటుంబంపై అన్నా రాంబాబు విరుచుకుపడ్డారు. మాగుంట కుటుంబాన్ని ప్రకాశం జిల్లా ప్రజలు 34 ఏళ్లుగా ఆదరించారని, కానీ ప్రజలకు ఉపయోగపడింది మాత్రం ఏమీ లేదని చెప్పారు. మాగుంట కుటుంబం వచ్చే ఎన్నికల్లో ఏ పార్టీ నుంచి పోటీ చేసినా... తాను ఓడించేందుకు పని చేస్తానని చెప్పారు. మాగుంట కుటుంబంలో ఎవరు పోటీ చేసినా ప్రజలు ఆలోచించి ఓటేయాలన్నారు. గత ఎన్నికల్లో జగన్ బొమ్మతో తాను 81 వేల ఓట్లపై చిలుకు మెజార్టీతో విజయం సాధించడం జరిగిందన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ గిద్దలూరులో వైసిపి జెండా ఎగురుతుందన్నారు. టిడిపి నేతలు మాత్రం అదే పార్టీకి చెందిన వారికి కండువాలు కప్పుకుని పార్టీలో వందల కుటుంబాలు చేరినట్లు ప్రకటించుకోవడం వింతగా ఉందన్నారు. గత ఎన్నికల్లోనూ ఇదే జరిగిందన్నారు. తనపై కొందరు లేనిపోని అపవాదులతో తప్పుడు ప్రచారం చేయడం బాధగా ఉందన్నారు. తననే కాదు... తన కుటుంబాన్ని కూడా కించపరిచే విధంగా తప్పుడు ప్రచారం జరిగిందన్నారు. నిజంగా తాను తప్పు చేస్తే దూషించినా పర్వాలేదన్నారు. ప్రజల నుంచి తాను ఎన్నడూ డబ్బు తీసుకోలేదన్నారు. నిస్వార్థంగా ప్రజా సేవ చేశానన్నారు. తాను ఎలాంటి వ్యక్తినో గిద్దలూరు ప్రాంత ప్రజలకు తెలుసునన్నారు. తనపై ఇంత ఘోరంగా తప్పుడు ప్రచారం జరిగినా జిల్లా నాయకత్వం కనీసం ఓదార్చలేదన్నారు. ఈ విషయం అంతా సిఎం జగన్‌మోహన్‌రెడ్డికి చెప్పినట్లు చెప్పారు. తనపై సిఎం జగన్‌కు ఎంతో నమ్మకం ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో తనను పోటీ చేయాలని కోరినా ఆరోగ్య సమస్య కారణంగా పోటీలో నిలవలేకపోతున్నట్లు చెప్పారు. గిద్దలూరు ప్రాంత నాయకులు వర్గ వైషమ్యాలు లేకుండా ఇప్పటికైనా వైసిపి కోసం పనిచేయాలని, తాను కార్యకర్తగా మీతో నడుస్తానని చెప్పారు.

'సమగ్ర' ఉద్యోగుల అర్ధనగ్న ప్రదర్శన

ప్రజాశక్తి-ఒంగోలు

రెగ్యులర్ చేయాలని కోరుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మె బుధవారం 8వ రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా సమగ్ర శిక్ష ఉద్యోగులు అర్ధ నగ్న ప్రదర్శనతో నిరసన తెలిపారు. కార్యక్రమానికి ప్రకాశం జిల్లా జెఎసి అధ్యక్షులు ఎం.హరిబాబు అధ్యక్షత వహించారు. సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఏపి టీచర్స్ గిల్డ్ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి భోగిరాల వెంకటేశ్వర్లు, రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ సిహెచ్ వెంకటేశ్వర్లు జిల్లా ఆర్థిక కార్యదర్శి రమేష్, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.వెంకట్రావు సిహెచ్ ప్రభాకర్ రెడ్డి మద్దతు తెలియజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జివి కొండారెడ్డి మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులు న్యాయ మైన డిమాండ్స్‌ను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. మహిళా ఉద్యోగులు కోలాటంతో, మధు బృందం వారి పాటలతో సమగ్ర శిక్ష

ఒంగోలులో అర్ధ నగ్న ప్రదర్శన చేస్తున్న ఉద్యోగులు

ఉద్యోగులందరినీ ఉత్సాహపరిచారు. కార్యక్రమంలో ప్రైవేట్ పాఠశాలల సంఘం అధ్యక్షులు ఎ.శ్రీనివాసరెడ్డి, జెఎసి జిల్లా ప్రధాన కార్యదర్శి యు.కళ్యాణి, మెంబర్స్ మధు, నరసింహం, ఉద్యోగులు పాల్గొన్నారు.

బాపట్ల: కలెక్టరేట్ ప్రధాన ద్వారం వద్ద సర్వ శిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మె బుధవారం ఎనిమిదో రోజుకు చేరింది. సమస్యల పరిష్కారం కోరుతూ బాపట్ల శాసనసభ్యులు కోన రఘుపతి ఇంటికి సమగ్ర శిక్ష ఉద్యోగులు ప్రదర్శనగా వెళ్లి వినతిపత్రం అందజేశారు. సమ్మెకు బాపట్ల జేఏసీ ఉద్యోగుల సంఘం నాయకులు, దళిత వాయిస్ నాయకులు జి. చార్వక, రోజన్ బాబు, కొండారెడ్డి, యుటిఎఫ్ నాయకులు. ఎస్. పాపారావు, సిహెచ్. వెంకటేశ్వర్లు, బాపట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షులు బీమాలీలా కృష్ణ, న్యాయవాదులు సురేష్‌బాబు, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, రామాంజనేయులు సంఘీభావం తెలిపారు.

ఎమ్మెల్యే కోనకు అర్జీ ఇస్తున్న ఉద్యోగులు

బకాయిలు వెంటనే చెల్లించాలి

- యుటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కె.శ్రీనివాసరావు - కలెక్టరేట్ వద్ద యుటిఎఫ్ ధర్నా

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక బకాయిలు వెంటనే చెల్లించాలని యుటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కె.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. బకాయిల సాధన కోసం యుటిఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కొమ్మోజు శ్రీనివాసరావు మాట్లాడుతూ 11 పిఆర్‌సి బకాయిలు, ప్రకటించిన 2 డిఏల బకాయిలు సుమారు 12 కోట్లు, సరండర్ లీవు బకాయిలు 4,500 కోట్లు, ఇంత వరకు చెల్లించకపోవడం దారుణమన్నారు. సకాలంలో జీతాలు కూడా 1వ తేదీన చెల్లించటం లేదన్నారు. పిఎఫ్, ఎపిజిఎల్ఐ లోన్ల పార్ట్ ఫైనల్ బకాయిలు సుమారు 1500 కోట్లు ఉందన్నారు. గత ఆగస్టులో జరిగిన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లో అన్ని రకాల బకాయిలు 2023 సెప్టెంబర్ నాటికి చెల్లించలేదని దుయ్యబట్టారు. తక్షణమే చెల్లించాలని, యుటిఎఫ్ దశల వారీ పోరాటానికి సిద్ధమవుతుందన్నారు. తొలి దశలో భాగంగా అన్ని జిల్లాల్లో జరుగుతుందని, ప్రకాశం జిల్లాలో ఒంగోలు, దర్శి, పొదిలి, కనిగిరి, గిద్దలూరు, మార్కాపురం, కంభం, వై.పాలెంలో 6 గంటల పాటు బకాయిలు చెల్లించాలని ధర్నాలు జరుగుతున్నాయన్నారు.

బాపట్లలో డిటికి అర్జీ ఇస్తున్న యుటిఎఫ్ నేతలు

యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వీరాంజనేయులు మాట్లాడుతూ బకాయిలు చెల్లించకుండా, సకాలంలో 1వ తేదీ జీతాలు ఇవ్వకుండా ప్రభుత్వం ఉపాధ్యాయుల పట్ల కక్షపూరిత వైఖరి అవలంబిస్తుందన్నారు. మెడికల్ లీవులు కూడా సరిగా అందటం లేదని, అవసరానికి, పిల్లల పెళ్ళిళ్ళకు, గృహ అవసరాలకు పిఎఫ్ లోన్లు పెట్టుకుంటే దాచుకున్న సొమ్ము కూడా ఇవ్వటం లేదన్నారు. ఫ్రెండ్లీ గవర్నమెంట్ అని అన్నీ సకాలంలో ఇస్తామని నేడు అన్నీ బకాయిలుగా మారుస్తున్నారన్నారు. వెంటనే బకాయిలు చెల్లించకపోతే జనవరి 3న జిల్లాలో వేలాది మందితో ధర్నాకు సిద్ధమవుతామన్నారు. ధర్నా శిబిరానికి అధ్యక్షత వహించిన ఎస్.రవి మాట్లాడుతూ అంగన్‌వాడీలు, ఎస్ఎస్ఏ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఆందోళనలో ఉన్నారన్నారు. సమస్య పరిష్కరించకపోతే ఉద్యమం మరింత ఉధృతం చేస్తామన్నారు. ధర్నాలో జిల్లా సహాధ్యక్షులు జి.ఉమా మహేశ్వరి, కోశాధికారి ఎన్.చిన్నస్వామి, కార్యదర్శులు బాలరాజు, వెంకయ్య, ఝాన్సీ, రాష్ట్ర కౌన్సిలర్లు ఎస్‌వి కొండారెడ్డి, ఒంగోలు ప్రాంతీయ మండలాల బాధ్యులు, సుమారు 100 మంది కార్యకర్తలు పాల్గొన్నారు.

బాపట్లలో ఉపాధ్యాయుల ధర్నా

బాపట్ల: ఉపాధ్యాయుల బకాయిలు వెంటనే చెల్లించాలని యుటిఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం బాపట్లలో ధర్నా నిర్వహించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ ధనలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా బాధ్యులు ఎం.సురేష్, ఎం.వెంకటేశ్వర్‌రెడ్డి, జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జడ వినయ్‌కుమార్, అడుగుల శ్రీనివాసరావు మాట్లాడారు. ధర్నాలో బాపట్ల రూరల్, టౌన్, కర్లపాలెం, పివి పాలెం శాఖల బాధ్యులు చక్రధర్, నన్నేరయ్య, రాజేష్, కోటేశ్వరరావు, శ్రీనివాసరావు, నారాయణ, రహంతుల్లా, హబీబ్, తోట శ్రీనివాసరావు, సంజయ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అవార్డు అందుకుంటున్న సుధీర్

ఉత్తమ బిజినెస్‌మెన్‌గా సుధీర్

ప్రజాశక్తి-ఒంగోలు

యువ పారిశ్రామికవేత్త, టిడిపి బోర్డు సభ్యులు శిద్దా సుధీర్‌కుమార్ ఉత్తమ బిజినెస్‌మెన్ అవార్డును అందుకున్నారు. బెంగుళూరు నేషనల్ కన్వెన్షన్ నాట్ కాన్-2023 జూనియర్ చాం బర్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో హోటల్ హిల్టన్‌లో టు బిజినెస్ ఇండస్ట్రియల్ ప్రొఫెషనల్ అవార్డ్ వేడుకలు నిర్వహించారు. కర్ణాటక లేబర్ మినిస్టర్ సంతోష్ ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఈ వేడుకలలో జూనియర్ చాంబర్ ఇండియా జాతీయ ప్రెసిడెంట్ జె.ఎఫ్.ఎస్.కార్తికేయ ద్వారా సుధీర్ ఉత్తమ బిజినెస్‌మెన్ అవార్డ్‌ను అందుకున్నారు. ఈ సందర్భంగా జె.సి.ఐ ప్రతినిధులు శిద్దా సుధీర్‌కుమార్‌ను శాలువాతో సత్కరించి మెమోంటో అందజేశారు.

ఎమ్మెల్యేకు వాలంటీర్ల వినతి

ప్రజాశక్తి-కనిగిరి

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్‌కు వాలంటీర్లు వినతిపత్రం అందజేశారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, గౌరవ వేతనం పెంచాలని, కోరారు. సీఎం దృష్టికి తీసుకెళ్తానని ఎమ్మెల్యే తెలిపారు.

మోకాళ్లపై నిల్చొని మున్సిపల్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

తమ సమస్యలు పరిష్కరించాలని ఏపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు చేస్తున్న సమ్మె రెండోరోజైన బుధవారం కొనసాగింది. ఒంగోలు కార్పొరేషన్ కార్యాలయం వద్ద కార్మికులు మోకాళ్లపై నిల్చొని నిరసన తెలియజేశారు. కార్యక్రమానికి యూనియన్ కార్యదర్శి రత్న కుమారి అధ్యక్షత వహించారు. సిఐటియు నగర ఉపాధ్యక్షులు జి.రమేష్ మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు నగర ఉపాధ్యక్షులు తంబి శ్రీనివాసులు, యూనియన్ నాయకులు కె సామ్రాజ్యం, ఆర్ రాములు, టి విజయ, కె మోహన్‌రావు, రంపతోటి శ్రీనివాసరావు, కె వెంకటేశ్వర్లు, కె సల్మాన్‌రాజు, ఎస్.వెంకటేశ్వర్లు, కె.రాఘవులు, రమేష్, కె.శ్రీదేవి పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

నా పేరుతో అసత్య ప్రచారం చేస్తున్నారు..: మాగుంట

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

తన పేరుతో సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తున్న వారిని కనిపెట్టి తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి ఒంగోలు డిఎస్‌పికి ఫిర్యాదు చేశారు. 'వైసిపిలో ఉంటే ఇబ్బందులు తప్పేలా లేవు. ఏ ప్రాంతం కూడా అభివృద్ధికి నోచుకోలేదు. టిడిపిలోకి వెళ్లాలని అనుచరుల నుంచి ఒత్తిడి మొదలవుతుంది. కొత్త సంవత్సరంలో అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటా..' అంటూ తన ఫొటోతో అసత్యప్రచారం చేస్తున్నారని చెప్పారు. ఈ అసత్య ప్రచారం చేసిన వారిని సత్వరమే కనిపెట్టి వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

38వ డివిజన్‌లో 'జనం కోసం జనార్ధన్'

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జనం కోసం జనార్ధన్, బాబు ష్యూరిటీ భవిష్యత్తుకి గ్యారెంటీ కార్యక్రమం ఒంగోలు నగరంలోని 38వ డివిజన్‌లో బుధవారం నిర్వహించారు. టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్‌రావు ఇంటింటికి వెళ్లి సమస్యలను తెలుసుకున్నారు. డివిజన్‌లో మినీ మేనిఫెస్టో కరపత్రాలను అందజేశారు. తెదేపా అధికారంలోకి వస్తే అమలు చేయబోయే సంక్షేమ పథకాలను వివరించారు. దామచర్ల మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తు బాగుండాలంటే చంద్రబాబు మళ్లీ సిఎం కావాలని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో తెదేపా గెలుపు అత్యవసరమని, ప్రజలందరూ టిడిపిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జనసేన కార్పొరేటర్ మలగా రమేష్, మంత్రి శ్రీనివాసరావు, కొరారి నాగేశ్వరావు, డివిజన్ అధ్యక్షులు పగిడి రాములు, పసుపులేటి సునీత పాల్గొన్నారు.

ప్రజలతో మాట్లాడుతున్న జనార్ధన్